లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

శనివారం 28.03.2020 • సంపుటి 9 • సంచిక 273 • వెల. రూ. 6.50 కరీంనగర్ పేజీలు : 12 + 8

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com
/ntdailyonline


# ముఖ్యమంత్రిగారికి అండగా ఉందాం!



అది.. కంటికి కనిపించని విరోధి.
ప్రాణభయంతో ప్రపంచం!
అగ్రరాజ్యాలే ఊపిరి పీల్చుకోలేని తరుణం.
భారతదేశం సరికొత్త చరిత్రకు నాంది పలకాల్సిన సమయమిది.

**సామాజిక దూరం పాటిద్దాం**
**కరోనాను తరిమికొడదాం!**

వ్యాధి నుంచి కాపాడుకోవడం, ప్రజల జీవనాధారాన్ని ధ్రువీకరించడంలోనూ ఏమాత్రం విశ్రాంతి లేకుండా కుటుంబ పెద్దగా, రేయింబవళ్లు శ్రమిస్తున్నారు మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు గారు. కరోనా మహమ్మారిపై ఉక్కుపాదం మోపి తరిమికొట్టేందుకు కంకణం కట్టుకున్నారు మన ప్రియతమ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడి గారు.

వీరితోపాటు రేయంబవళ్లు శ్రమిస్తూ, ఎంతో అంకితభావంతో సేవలందిస్తున్న వైద్యులు, నిపుణులు, నర్సులు, ఆస్పత్రి నిర్వాహకులు, అంబులెన్స్ డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు.. అంతేనా? మంత్రులు, కలెక్టర్లు, పోలీసు యంత్రాంగం, ప్రభుత్వ అధికారులు.. ఇంకా ఎందరెందరో!

వారికి నా రెండు చేతులు జోడించి నమస్కారం తెలియజేసుకుంటున్నా. మనం చేయాల్సిందల్లా ఒకటే.. ఎంతో జాగ్రత్తగా **ఇంట్లోనే ఉందాం! మన విరోధిని మన ధరికి రానివ్వకుండా చేద్దాం.** బాధిత దేశాలను చూస్తుంటే.. మనం ఇసుమంత కూడా అజాగ్రత్త పడకూడదని స్పష్టమవుతోంది. ఏమాత్రం హద్దులు దాటినా పెను ప్రమాదాన్ని చవిచూడాల్సి వస్తుంది!

సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మకండి. తప్పు సమాచారాలను ప్రచారం చేయకండి.
ప్రభుత్వం వెలువరించే అధికారిక సమాచారాలనే నమ్ముదాం.

'డబ్బులు ఎవరికీ ఊరికే రావు' అని మీ కష్టార్జితాన్ని ఆదా చేయడంలో అవగాహన కల్పించిన నేను, ఇప్పుడు 'ఆరోగ్యం కూడా ఊరికే రాదు' అని చెప్పాల్సిన పరిస్థితిలో ఉన్నా. ముందుగా మనం ఆరోగ్యంతో ఉందాం. ఆ తర్వాత అన్నీ చూసుకోవచ్చు!



మీ,
డా॥ ఎం.కిరణ్‌కుమార్
లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

కనిపించని శత్రువుతో పోరుకు
సిద్ధమైన మహాయుధం
కరోనా కట్టడికి చివరి ఘంటానాదం
భారత్ లాక్ డౌనే కదా!



డాక్టర్ వంగర త్రివేణి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

## గవర్నర్లతో రాష్ట్రపతి వీడియో కాన్ఫరెన్స్

- **కరోనా నియంత్రణ చర్యలపై ఆరాతీసిన రాంనాథ్ కోవింద్**
- **తెలంగాణ చర్యలను వివరించిన తమిళిసై సౌందరరాజన్**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ కట్టడికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తీసుకొంటున్న చర్యల గురించి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ వాకబు చేశారు. శుక్రవారం ఆయన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో తాజా పరిస్థితులు, కరోనా కట్టడికి కేంద్రం సాయం, రాష్ట్రాలు తీసుకొంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. రాష్ట్రపతికి వివరించారు. కరోనా నిర్ధారణ పరీక్షలు చేయడానికి రాష్ట్రంలో పలు దవాఖానలు సిద్ధంగా ఉన్నాయని, ఇప్పుడున్నవాటికి తోడుగా మరో మూడు ప్రైవేట్ ల్యాబులకు ఐసీఎంఆర్ అనుమతించినట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్రపతికి గవర్నర్ నివేదించారు.

**వాలంటీర్లు ముందుకు రావాలి: గవర్నర్**

కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టి ప్రజలను జాగృతం చేయడానికి రెడ్‌క్రాస్ సొసైటీ వాలంటీర్లు రంగంలోకి దిగాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం పిలుపునిచ్చారు. రక్తం కొరత లేకుండా విరివిగా రక్తదాన శిబిరాలను నిర్వహించాలని జిల్లాల బ్రాంచ్ హెడ్‌లకు సూచించారు. రాజ్‌భవన్‌కు ఎదురుగా ఉన్న మురికివాడలోని పేదలకు నిత్యావసర సరుకులను సరఫరా చేసి ఆదుకోవాలన్నారు.

## స్వీయ నియంత్రణతోనే కరోనా కట్టడి

- **ట్విట్టర్‌లో జిఫ్‌ను పోస్ట్‌చేసిన ఎంపీ సంతోష్‌కుమార్**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా కట్టడికి ప్రస్తుతం పాటిస్తున్న నిర్ణీత దూరం (సోషల్ డిస్టెన్సింగ్)పై నెటిజన్లలో అవగాహన కల్పించేందుకు రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ నడుంబిగించారు. దీని ప్రాధాన్యాన్ని కండ్లకు కట్టేలా గ్రాఫిక్స్ ఇంటర్‌చేంజ్ ఫార్మాట్‌లో రూపొందించిన ఇమేజ్‌ను ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. కరోనా వైరస్ ఒకరి నుంచి ఇద్దరికి.. వారి నుంచి మరో నలుగురికి, వారినుంచి ఇంకొందరికి వ్యాపించే క్రమాన్ని ఈ పోస్ట్ ద్వారా వివరించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణతో నిర్ణీత దూరం పాటిస్తూ, బయటకు రాకుండా ఇండ్లలోనే ఉండటం వల్ల తమను తాము కాపాడుకోవడంతో పాటు ఇతరులను కాపాడినవారవుతారని ట్వీట్ చేశారు.



ఎంపీ సంతోష్‌కుమార్ చేసిన ట్వీట్

# సంఘం శరణం గచ్ఛామి

ఏకచక్రపురం అనే ఊరు దగ్గర్లో.. చుట్టూ అలుముకున్న అడవి మధ్యన.. ఒక కొండ గుహలో ఒక రాక్షసుడు ఉండేవాడు. వాడు రోజూ ఊరిమీద పడి దొరికిన మనుషులను, పశువులను దొరికినట్టు భక్షించేవాడు. దీనివల్ల చాలా నష్టం జరుగుతున్నదని గ్రహించిన గ్రామస్థులు రాక్షసుడితో ఒక ఒప్పందం కుదుర్చుకొన్నారు. దాని ప్రకారం- రోజుకు ఒక బండినిండా అన్నం, ఒక దున్నపోతు, ఒక మనిషి.. వాడి గుహకు టైం ప్రకారం ఆహారంగా వెళ్ళాలి. వాటిని వాడు సుష్టుగా భుజించి మళ్ళీ తెల్లవారి కోటాకోసం ఎదురుచూస్తూ ఉండేవాడు. విధిలేక గ్రామస్థులు ఇంటికొకరి చొప్పున వంతులవారీగా వాడికి ఆహారం పంపేవారు.

మీకు తెలిసిన కథే ఇది. ఆ రాక్షసుడే బకాసురుడు. అరణ్యవాసంలో భాగంగా ఏకచక్రపురం చేరిన పాండవులలో ఒకరైన భీముడు గ్రామస్థులను ఆదుకొనేందుకు తాను ఆహారంగా వెళ్లి బకాసురుడ్ని వధిస్తాడు. దాంతో కథ సుఖాంతమైనా ఇందులో నేర్చుకోవాల్సిన ఒక మంచి పాఠం ఉన్నది. అదే, గ్రామస్థుల సంఘనీతి. యావత్ సమాజ శ్రేయస్సు పరమ ధ్యేయంగా పౌరులు త్యాగనిరతితో నిర్వర్తించిన బాధ్యత.

**బాధ్యతారాహిత్యం వద్దు**

అన్ని మతాలూ పరులకోసం పాటుపడాలనే చెప్తాయి. అన్నింటి సారం.. 'సర్వే జనా సుఖినో భవంతు'నే. సొంతలాభం మొత్తం మానుకొని సంఘం ప్రయోజనాలకు పెద్దపీటవేయాలని బౌద్ధం అద్భుతంగా ప్రబోధించింది.. సంఘం శరణం గచ్ఛామి అని. యావత్ మానవ జాతిని వణికిస్తున్న కరోనా వైరస్‌పై సమరంలో మనకు ఇప్పుడు కావలసింది ఈ సంఘ నీతే. వైరస్ ఎప్పుడు ఏ ముప్పు తెస్తుందో తెలియని పరిస్థితుల్లో ప్రజలంతా కమ్యూనిటీ (అంటే.. మన కులం కాదండోయ్) కోసం మాత్రమే ఆలోచించాలి, తపించాలి. కారణం.. కరోనాకు కుల, మత, ప్రాంత భేదాలు లేవు. మన బాధ్యతారాహిత్యమే దానికి పండుగ. ప్రభుత్వం సూచించిన సూచనలను తూచా తప్పకుండా పాటించడం ఇప్పుడు మన సంఘనీతి. ఈ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించేవారిని మందలించడం కూడా మన పనే.

### విరామ యోగం-3



**కరోనా పోరులో భాగస్వాములవ్వాలి**

1981 ప్రాంతంలో హెచ్‌ఐవీ ప్రబలుతున్న తొలినాళ్లలో.. అది కేవలం స్వలింగ సంపర్కులకు మాత్రమే వచ్చే వ్యాధి అని భావించారు. ఆ దిశగా చర్యలు తీసుకొన్నారు. ఆ తర్వాత దాని విశ్వరూపం తెలుసుకొనేలోపే ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈ మాయదారి రోగకారక క్రిములకు నియమ నిబంధనలూ గట్రా ఏమీ ఉండవు. అవి ఏ రూపు సంతరించుకొని ఎట్లా పీడిస్తాయో చెప్పలేం. అందుకే భారతదేశం కరోనాపై సమరాన్ని ఉధృతంచేసింది. ఇందుకు సంఘం తోడ్పాటు, సహకారం చాలా అవసరం. కరోనాపై వాస్తవ స్థితిగతులను వివరించడానికి, ఫేక్‌న్యూస్ వ్యాప్తిని నిరోధించడానికి కర్ణాటక ప్రభుత్వం వాలంటీర్లను నియమిస్తున్నది. కొవిడ్ సంఘర్ష్ సేనాని పేరిట హర్యానా కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నది. తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు కూడా సేవలందించే యువకుల అవసరముంటుంది. కేంద్రప్రభుత్వం కరోనాపై సమరంలో భాగస్వాముల కోసం ఆన్‌లైన్లో రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నది. ఇప్పటికే దాదాపు 200 సంస్థలు, 5వేలకు పైగా వ్యక్తులు ఈ యుద్ధంలో మేము సైతం అంటూ ముందుకు వచ్చి పోరాటానికి సంసిద్ధత తెలిపారు. సమాజ సేవ చేయాలనుకొనేవారికి ఇదొక మహత్తర అవకాశం. మంచి- చెడు, కష్ట-సుఖాలు, సంతోష-విషాదాలను సంయమనంతో స్వీకరించాలన్న అత్యద్భుత సందేశంతో తెలుగు సంవత్సరాది ఉగాది షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడి తెచ్చింది. ఇందులో వేపపూత, మామిడి ప్రస్తుత వాతావరణంలో బాగా ఉపకరించేవే. మనమంతా ఇండ్లకు పరిమితమైన సమయంలో వచ్చిన ఈ పండుగ ఇచ్చిన స్ఫూర్తితో కరోనాపై మన సమష్టి పోరాటం.. మరింత ఉధృతం కావాలి.



**డాక్టర్ సూరావఝుల రాము**
సీనియర్ జర్నలిస్ట్,
ప్రముఖ మేనేజ్‌మెంట్ శిక్షణ సంస్థ
ఆస్కీలో పౌర సంబంధాల విభాగం అధిపతి

### క్వారంటైన్ పుణ్యాన.. న్యూటన్ గురుత్వాకర్షణ

అది 1665 వ సంవత్సరం, ఆగస్టు నెల. బ్యుబోనిక్ ప్లేగుతో లండన్ అతలాకుతలమవుతున్నది. వ్యాధి నియంత్రణ, నివారణ చర్యల్లో భాగంగా.. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాన్ని మూసివేశారు. ఇరవై రెండేండ్ల రైతు బిడ్డ న్యూటన్ విద్యాభ్యాసం చేస్తున్నది అక్కడే. కేంబ్రిడ్జ్ మూతపడటంతో అయన చాలా కష్టపడి నడిచి, గుఱ్ఱపు బగ్గీ పట్టుకొని తన స్వస్థలమైన ఊల్స్‌స్ట్ హోర్ప్ చేరుకొన్నాడు. క్వారంటైన్‌లో భాగంగా అయన అక్కడ 18 నెలలు ఏకాంతంగా ఉండాల్సి వచ్చింది. విశ్వంపై ప్రపంచానికి ఉన్న దృక్కోణాన్ని పునర్నిర్వచించిన గురుత్వాకర్షక సిద్ధాంతాన్ని న్యూటన్ కనిపెట్టింది అక్కడే. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి కేంబ్రిడ్జ్‌లో ఉండి ఉంటే ఆ హడావుడిలో పడి ఉండేవాడేమో, ఈ విప్లవాత్మక సిద్ధాంతం రూపుదిద్దుకొనేది కాదేమో! 16, 17 శతాబ్దాల్లో లండన్‌ను ప్లేగు వ్యాధి కుదిపివేసింది. దీని ప్రభావం దారుణంగా ఉన్న 1665 సెప్టెంబర్ ప్రాంతంలో వారానికి దాదాపు ఎనిమిదివేల మంది మృత్యువాతపడ్డారు. ధనికులు, కింగ్ చార్లెస్ 2 సహా ఆ దెబ్బకు ప్రాణాలు అరచేత పట్టుకుని క్వారంటైన్ చేసుకొన్నారు. వ్యాధి పీడితులను ఇండ్లలోనే ఉంచి అధికారులు ఆ ఇంటికి రెడ్‌క్రాస్ గుర్తు వేసేవారని చరిత్ర చెప్తున్నది.

### వీ-ఫోర్స్‌లో చేరండి..

యూఎన్వీ ఇండియా ఆధ్వర్యంలో పనిచేస్తున్న వీ-ఫోర్స్ ఇండియా కొవిడ్-19కు వ్యతిరేకంగా చేపట్టిన ఆన్‌లైన్ ప్రచారంలో వాలంటీర్లుగా సేవచేయాలనుకొనేవారిని ఆహ్వానిస్తున్నది. వీ-ఫోర్స్ వాలంటీర్‌గా మీ పేర్లను https://v-force.in లో నమోదుచేసుకోండి. కరోనా కారణంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న జీవితాలకు అండగా నిలిచేందుకు బాధ్యతాయుతమైన పౌరుడిగా ఈ వేదిక ద్వారా చేపట్టే ప్రజాఉద్యమంలో పాలుపంచుకొని సరైన సమాచారాన్ని చేరవేస్తూ సమస్య పరిష్కారానికి కృషిచేయండి.

## వర్సిటీ పరీక్షలకు సిలబస్ కుదింపు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ కట్టడిలో భాగంగా 14 వరకు లాక్‌డౌన్ నేపథ్యంలో వర్సిటీల్లో పరీక్షలకు సిలబస్‌ను కుదించే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఈ అంశంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్వర్యంలో రిజిస్ట్రార్లతో చర్చిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా సిలబస్ కుదించాలా? యథావిధిగా కొనసాగించాలా అనే అంశాలను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. బీటెక్, ఎంటెక్ కోర్సుల సిలబస్ తగ్గించడంపై కూడా ఆలోచిస్తున్నట్టు సమాచారం.

**ఎంసెట్‌కు 1.58 లక్షల దరఖాస్తులు**

మరోవైపు మే 4 నుంచి నిర్వహించే ఎంసెట్ సీబీటీ పరీక్షలకు 1.58 లక్షల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్నట్టు సెట్ అధికారులు తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉన్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో గడువు పొడిగించే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

## కరోనాపై వ్యాసరచన

- **స్లోగన్, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు**
- **బంధన్ సంస్థ చైర్‌పర్సన్ వనిత ప్రకటన**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్‌పై జాతీయస్థాయిలో వ్యాసరచన, స్లోగన్, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జర్నలిస్టు, రచయిత్రి, బంధన్ సంస్థ చైర్‌పర్సన్ వనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ప్రవేశ రుసుము లేదని పేర్కొన్నారు. కరోనా కట్టడికి ఆలోచనలు, సూచనలతో కూడుకున్న వ్యాసాలను 200 పదాలకు, స్లోగన్ పది పదాలకు మించకుండా, తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో రాయవచ్చని సూచించారు. డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో వాటర్ కలర్స్, ఆయిల్ కలర్స్, పెన్సిల్ షేడ్స్ ఇండియన్ ఇంక్ లేదా ఎలాంటి రంగుల్లోనైనా వేయవచ్చని పేర్కొన్నారు. పోటీదారులు ఎంట్రీలతోపాటు స్లోగన్‌లు, వ్యాసాలు, డ్రాయింగ్, పెయింటింగ్‌లను.. పూర్తి పేరు, వయస్సు, చిరునామా, ఫోన్ నంబర్‌తో bandhan.vanitha@gmail.comకు ఏప్రిల్ 14వ తేదీలోపు పంపాలని సూచించారు.

# ఇది పరీక్షా సమయం!

## లాక్‌డౌన్‌తో ఇండ్లలో ఉన్నవారికి, వృద్ధులకు, అనారోగ్య పీడితులకు వైద్యుల సూచనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాక్‌డౌన్ కారణంగా 21 రోజులపాటు ఎవ్వరూ ఇంటినుంచి బయటకురాలేని పరిస్థితి. వాకింగ్, వ్యాయామాలు అన్నీ బంద్. ఇలా పొద్దస్తమానం ఇంట్లోనే కూర్చోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నది. ముఖ్యంగా వృద్ధులు, బీపీ, షుగర్ లాంటి సమస్యలతో బాధపడేవారికి ఇది పరీక్షా సమయం. బయటకెళ్లి వాకింగ్, వ్యాయామాలు చేయలేని ప్రస్తుత పరిస్థితుల్లో బీపీ, షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవడం పెద్ద సవాలే. ఇలాంటివారు కొన్ని చిట్కాలు, మరికొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చంటున్నారు వైద్య, ఆరోగ్య నిపుణులు. వీటిని పాటించడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి కూడా బయటపడొచ్చని చెప్తున్నారు. కరోనా లక్షణాలైన జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి, ఛాతిలో నొప్పి, శ్వాస పీల్చడంలో కష్టం, నలత, గొంతునొప్పి, గుండెవేగంగా కొట్టుకోవడం లాంటి సమస్యలు బాధిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మానసిక ఒత్తిడికి లోనుకావొద్దని సూచిస్తున్నారు.

### రోగ నిరోధకశక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి



ఇది హెల్త్ ఎమర్జెన్సీలాంటి స్థితి. లాక్‌డౌన్ సమయాన్ని అర్థవంతంగా మార్చుకొనేందుకు అన్ని వయసులవారు ప్రయత్నించాలి. బీపీ, షుగర్ సమస్యలున్నవారు, వృద్ధులు రోగ నిరోధకశక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి. రోజువారీ ఆహారంతోపాటు తృణధాన్యాలు, సీజినల్‌గా లభించే పండ్లు, పాల పదార్థాలు తీసుకోవాలి. సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం వంటివి అలవరుచుకోవటం చాలా మంచిది.

– ప్రొఫెసర్ రాజేందర్‌రెడ్డి, ఆయుష్ రిటైర్డ్ కమిషనర్

### ఆరోగ్యరక్షణకు ఇలా చేద్దాం..



**ప్రాణాయామంతో మేలు**

ఆరు బయటకువెళ్లి వాకింగ్, వ్యాయామం చేసే అవకాశం లేనందున ఉదయం పూట ఇంట్లోనే ధ్యానం, ప్రాణాయామం చేయాలి. మానసిక ఒత్తిడిని ప్రాణాయామం ద్వారా నియంత్రించుకోవచ్చు. ట్రెడ్‌మిల్ వంటివి ఉంటే నడవాలి. క్యారమ్స్, చెస్ వంటి ఆటలు అలసట నుంచి బయటపడేస్తాయి.

**ఒకేచోట కూర్చోవద్దు**



రోజంతా ఒకేచోట కూర్చోవద్దు. తాము ఉంటున్న గదిలోనే ప్రతి రెండు గంటలకు ఒకసారి కనీసం 10 నిమిషాలు అటుఇటు తిరగాలి.

**ఏది పడితే అది తినొద్దు**



ఇంట్లో ఖాళీగా ఉన్నామని ఏదిపడితే అది తినొద్దు. ఆరోగ్యాన్ని పెంచే పండ్లు, క్యారెట్, కూరగాయలు, వేరుశనగ లాంటివి తింటే ఎంతో మంచిది.

**ఆనందంగా గడపాలి**



శారీరక శ్రమ లేకపోవడంతో మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలి. బాధ కలిగించే విషయాలకు దూరంగా ఉండాలి.

**ద్రవాహారం తీసుకోవాలి**



ఎక్కువగా పండ్లరసాలు, నిమ్మ షర్బత్ వంటివి తాగాలి. దీనివల్ల డీహైడ్రేషన్ సమస్య తలెత్తదు. డీప్ వీన్ థ్రాంబోసిస్ సమస్య నుంచి బయటపడతారు.

**మద్యం ముట్టొద్దు**



ఆల్కహాల్, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండాలి. అనారోగాన్ని తెచ్చే ఆహార పదార్థాలు తీసుకోరాదు.

**బయటకు రాకపోవడమే పెద్ద చికిత్స**



ప్రస్తుత తరుణంలో ఎవరూ బయటకు రాకపోవడమే పెద్ద ట్రీట్మెంట్. షుగర్, బీపీ, ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధ వ్యాధులున్నవారు మందు లవాడకం ఆపొద్దు. 21 రోజులకు సరిపడ మందులను నిల్వచేసుకోవాలి. సమయానికి భోజనం చేయాలి. తగినంత నిద్రపోవాలి. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

–డాక్టర్ ప్రవీణ్, ఎండీ, జనరల్ మెడిసిన్



ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న మేఘా సంస్థ అధినేత కృష్ణారెడ్డి

## మూడురాష్ట్రాలకు మేఘా రూ.8 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాను కట్టడిచేసేందుకు మేఘా ఇంజినీరింగ్ సంస్థ పలు రాష్ట్రప్రభుత్వాలకు భారీ విరాళాలు ఇస్తున్నది. గురువారం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5 కోట్ల విరాళమిచ్చిన ఆ సంస్థ అధినేత పీవీ కృష్ణారెడ్డి.. శుక్రవారం అమరావతిలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి రూ.5 కోట్ల చెక్కును అందజేశారు. కర్ణాటక ప్రభుత్వానికి రూ. 2 కోట్లు, ఒడిశాకు రూ.కోటి ప్రకటించారు. చెక్కులను సంస్థ ప్రతినిధులు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అందజేశారు.

## కరోనా కట్టడికి టాస్క్‌ఫోర్స్

- **జిల్లాకో కొవిడ్-19 దవాఖాన**
- **ఏపీ క్యాబినెట్ నిర్ణయం**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ కట్టడికి ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఐదుగురు మంత్రులు, 10 మంది ఐఏఎస్, నలుగురు సీఎంవో అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. సమాచారశాఖ మంత్రి పేర్నినాని ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా, నియోజవర్గస్థాయిలోనూ టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటుచేయాలని, విశాఖ, విజయవాడ, కాకినాడ, తిరుపతిలో ప్రత్యేక దవాఖానలు సిద్ధమని చెప్పారు. ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో చిక్కుకున్నవారికి ఆయా రాష్ట్రాలు వసతి కల్పించకుంటే తామే ఆ ఖర్చు భరించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో రాబోయే మూడు నెలల కాలానికి బడ్జెట్ కోసం ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలిపామన్నారు.

## ఎన్వోసీల ముసుగులో దోపిడీ

- **విద్యార్థుల భయాన్ని సొమ్ము చేసుకొన్న హోంగార్డు భీంసింగ్ అరెస్ట్**
- **పోలీసుల అదుపులో హాస్టల్ నిర్వాహకుడు**
- **పరారీలో బస్తీ అధ్యక్షుడు**

వెంగళరావునగర్: ఒకవైపు కరోనా వైరస్ భయంతో ఇండ్లకు చేరాలని వారు తహతహలాడుతుంటే.. మరోవైపు వారి భయాన్ని సొమ్ముచేసుకోవాలని పథకం రచించాడో హోంగార్డు. తనకున్న పరిచయాలతో ఎన్వోసీలు ఇప్పిస్తానంటూ అందినకాడికి దండుకొన్నాడు. స్థానిక బస్తీ నాయకుడు, హాస్టల్ నిర్వాహకుడొకరు ఈయనకు తోడయ్యాడు. చివరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. వివరాల్లోకెళితే.. అమీర్‌పేట డివిజన్‌లోని బాపూనగర్ పరిసరాల్లో 200కు పైగా హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో విద్యార్థులతోపాటు వివిధ కంపెనీల ఉద్యోగులు ఉంటున్నారు. కరోనా కట్టడికి లాక్‌డౌన్ ప్రకటించడంతో ఇండ్లకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు ఎన్వోసీ ఇవ్వాలంటూ ఎస్సార్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. పోలీస్‌స్టేషన్ వద్ద భారీ క్యూ ఉండటంతో.. వీరి భయాన్ని సొమ్ము చేసుకోవలని కొందరు కొత్త దందాకు తెరలేపారు. బాపూనగర్‌లో నివాసం ఉంటూ సెంట్రల్ జోన్ పీసీఆర్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు భీంసింగ్, పవన్ బాయ్స్ హాస్టల్ నిర్వాహకుడు ఏలూరి రామకృష్ణ, బాపూనగర్ బస్తీ అధ్యక్షుడు హరిసింగ్ జాదవ్.. ఎన్వోసీలు ఇప్పిస్తామంటూ విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేశారు. ఈ వ్యవహారంపై విశ్వసనీయ సమాచారం అందుకొన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం ఇద్దరిని అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఎస్సార్‌నగర్ పోలీసులకు అప్పగించారు. వీరిపై 384, 420 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి హోంగార్డు భీంసింగ్, బాయ్స్ హాస్టల్ నిర్వాహకుడు ఏలూరి రామకృష్ణను రిమాండ్‌కు తరలించారు. బాపూనగర్ బస్తీ అధ్యక్షుడు హరిసింగ్ జాదవ్ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

## 20% తగ్గిన విద్యుత్ డిమాండ్

- **సగటున 210 మిలియన్ యూనిట్లు వినియోగం**
- **37 శాతం విద్యుత్ వ్యవసాయ రంగానికే వాడకం**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ కట్టడికోసం దేశం మొత్తం లాక్‌డౌన్ అయిన నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా తగ్గింది. వ్యాపార, వాణిజ్యసంస్థలు, దుకాణాలు, కొన్నిరకాల పరిశ్రమలు మూసివేయడంతో గరిష్ఠ డిమాండ్‌లో సుమారు 20 గిగావాట్ల విద్యుత్ తగ్గింది. సంస్థలు, వ్యాపారాలు, దుకాణాలు, షాపింగ్ మాల్స్‌తోపాటు కొన్ని పరిశ్రమలు మూతపడగా.. గృహ సంబంధమైన విద్యుత్ వినియోగం, డిమాండ్ రెండూ పెరిగినట్టు విద్యుత్‌రంగ నిపుణులు చెప్తున్నారు.

**దక్షిణాది గ్రిడ్‌లో 8 వేల మెగావాట్లు**

దక్షిణాది గ్రిడ్‌లోనూ దాదాపు 8 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ తగ్గింది. తెలంగాణలో 1500 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పడిపోగా.. హైదరాబాద్ పరిధిలో 500 మెగావాట్ల వరకు తక్కువయింది. తెలంగాణలో వినియోగిస్తున్న విద్యుత్‌లో దాదాపు 37 శాతం వ్యవసాయ రంగానికే వాడుతున్నట్టు విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో శుక్రవారం గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 9,832 మెగావాట్లుగా ఉన్నది. ఈ యాసంగిలో దాదాపు 38 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయడం.. భూగర్భ జలాలు కూడా పుష్కలంగా ఉండటంతో రైతులు విద్యుత్‌ను భారీగా వినియోగిస్తున్నారు. పంటలు చివరిదశకు చేరిన నేపథ్యంలో మరో పక్షం రోజులు ఇలాగే ఉండే అవకావం ఉన్నదని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.



### ఆందోళన వద్దు

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్‌పై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. నిరంతరాయంగా విద్యుత్ నందించడంలో ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నాం. వ్యవసాయరంగానికి డిమాండ్ గతేడాదికన్నా పెరిగింది. 8వేల మెగావాట్లు మన విద్యుత్ అందుబాటులో ఉండగా.. కేంద్ర ఉత్పత్తి కేంద్రాల నుంచి 2,500 మెగావాట్లు వస్తున్నది. గతంలో 230 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉండగా.. ఇప్పు డు 205 మిలియన్ యూనిట్లకు తగ్గింది. కరోనా కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకొన్నాం. ఉత్పత్తి కేంద్రాల్లో రోజూ శానిటేషన్ చేస్తున్నాం.

– దేవులపల్లి ప్రభాకర్‌రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ

## ఆన్‌లైన్‌లో బీఎస్-4 వాహనాల రిజిస్ట్రేషన్

- **లాక్‌డౌన్ దరిమిలా రవాణాశాఖ నిర్ణయం**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీఎస్-4 వాహనాల రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో రవాణాశాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. ఆన్‌లైన్‌లో వాహనాల రిజిస్ట్రేషన్లు చేపట్టనున్నది. ఈ మేరకు రవాణాశాఖ అధికారులు శుక్రవారం విధివిధానాలను వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల దరిమిలా దేశవ్యాప్తంగా బీఎస్-4 వాహనాల రిజిస్ట్రేషన్లను ఈ నెల 31లోపు పూర్తిచేయాలని కేంద్రం నిర్ణయించింది. కరోనా వ్యాప్తి నిరోధానికి వచ్చే 14 వరకు లాక్‌డౌన్ పాటిస్తున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. గడువు పెంపుపై కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే సరిపోతుందని, సాయంత్రానికల్లా వాహనానికి నంబరును కేటాయిస్తామని అధికారులు చెప్తున్నారు. లాక్‌డౌన్ పూర్తిగా సడలించిన తర్వాత ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లి వాహనాలను తనిఖీ చేయించుకుని ఆర్సీని పొందవచ్చు.

నమస్తే తెలంగాణ
తాజా వార్తలు,
ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ




శనివారం 28.03.2020
• సంపుటి 9 • సంచిక 273 • వెల. రూ. 6.50
కరీంనగర్
పేజీలు : 12 + 8
చతుర్థి
సూర్యోదయం: ఉదయం 6.12, సూర్యాస్తమయం: సాయంత్రం 6.23, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం చతుర్థి అర్ధరాత్రి 12.18 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: భరణి మధ్యాహ్నం 12.53 వరకు, తదుపరి కృత్తిక, అమృతఘడియలు: ఉదయం 7.32 నుంచి 9.19 వరకు, రాహుకాలం: ఉదయం 9.15 నుంచి 10.47 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.12 నుంచి 7.50 వరకు, వర్జ్యం: ఆదివారం తె.ఝా. 2.05 నుంచి 3.51 వరకు,
PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

# మీకోసం నేనున్నా!

**మీరు కడప దాటొద్దు**

ప్రజలకు ధన్యవాదాలు. చాలా మంచి సహకారం అందిస్తున్నారు. ఇలా అందరి సహకారం లేకపోతే పరిస్థితి చాలా భయంకరంగా ఉండేది. మనందరి బతుకులు ప్రమాదంలో పడేవి. పూర్తిస్థాయిలో లాక్‌డౌన్ చేసి రాత్రి వేళల్లో కర్ఫ్యూ అమలుచేస్తున్నా ఒక్క శుక్రవారమే పది పాజిటివ్‌లు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవాలి. అమెరికా, చైనా, స్పెయిన్, ఇటలీ స్థాయిలో భారత్‌లో కూడా కరోనా వ్యాపిస్తే 20 కోట్ల మంది జబ్బుబారిన పడే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు.

- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు


ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయల విరాళం చెక్కును శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కే చంద్రశేఖర్‌రావుకు అందజేస్తున్న కోహినూర్ గ్రూప్ చైర్మన్ మహ్మద్ అహ్మద్ ఖాద్రి

## 60 వేల మందికి వైరస్ సోకినా చికిత్సకు ఏర్పాట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మీకోసం నేనున్నానంటూ ప్రజలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు భరోసా ఇచ్చారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజలు కడపదాటి బయటకు రావొద్దని చేతులు జోడించి విజ్ఞప్తిచేశారు. తెలంగాణలో ఏ రాష్ట్రంవారు ఉన్నా, ఏ ప్రాంతంవారు ఉన్నా వారిలో ఒక్కరి కడుపు కూడా మాడకుండా భోజనం పెడుతానని హామీ ఇచ్చారు. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 60 వేలకు చేరినా వారందరికీ వైద్యం అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 15 వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. లాక్‌డౌన్, కరోనా కట్టడికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధత, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం సాయంత్రం ప్రగతిభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా వైరస్ మరింత వ్యాప్తిచెందినా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉన్నదని స్పష్టంచేశారు. ఇప్పటికిప్పుడు 12,400 మంది రోగులనైనా క్రిటికల్, ఐసొలేషన్ వార్డుల్లో పెట్టి చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లుచేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను మార్చి 31 వరకు అనుకున్నామని, దానిని ఏప్రిల్ 15 వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. ప్రధానమంత్రి ప్రకటించిన లాక్‌డౌన్ కూడా వచ్చే నెల 15 వరకు ఉన్నదని తెలిపారు. రాత్రిపూట కర్ఫ్యూ ఉంటుందని పేర్కొన్నారు. పగటివేళల్లో సమయం ఉన్నది కాబట్టి బయట తిరగాలనే ఆలోచన సరికాదని, కూరగాయలకు కూడా గుంపులుగా పోవద్దని ఆయన సూచించారు. శుక్రవారం ఒక్కరోజే రాష్ట్రంలో 10 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల

మిగతా 4వ పేజీలో

కరోనా వ్యాప్తిని నిరోధించడమే ఈ పరిస్థితుల్లో పెద్ద మందు. అందుకే ప్రజలకు నేను మరోసారి రెండు చేతులు జోడించి చెప్తున్నా.. స్వీయ నియంత్రణే మనకు శ్రీరామరక్ష. ఈ ఆపత్కాల సమయంలో మరేదీ మనల్ని కాపాడదు. గుంపులుగా రోడ్లపైకి రావొద్దు. ఏమైతదిలే.. అనే నిర్లక్ష్యం ఎంతమాత్రం పనికిరాదు.

- సీఎం కేసీఆర్


శుక్రవారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, నిరంజన్‌రెడ్డి, కే తారకరామారావు, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా ఉన్నారు

### లాక్‌డౌన్ 15 వరకూ

- 11వేలమందికి సరిపడా ఐసోలేషన్ బెడ్స్
- గచ్చిబౌలి క్వారంటైన్ రెండ్రోజుల్లో సిద్ధం
- 1400 మంది కోసం ఐసీయూ బెడ్స్
- 12,400 ఇన్‌పేషెంట్ పడకలు
- 500 కొత్త వెంటిలేటర్లకు ఆర్డర్
- 11 వేల రిటైర్డ్ వైద్యులు, సిబ్బంది సేవలు
- గాంధీ, కింగ్‌కోఠి కరోనా చికిత్సకే
- మొత్తం 59 చేరిన పాజిటివ్‌లు
- 20,000 మంది క్వారంటైన్‌లో
- లాక్‌డౌన్‌కు ప్రజల పూర్తి సహకారం
- అదే లేకుంటే పరిస్థితి భయానకం
- అయినా ఒక్కరోజే 10 కేసులు
- పరిస్థితి తీవ్రతకు ఇదే నిదర్శనం
- నాకేమైతదిలే అనే నిర్లక్ష్యం తగదు
- ఇబ్బందులున్నా ప్రజలు ఓర్చుకోవాలి
- రాక్షసితో యుద్ధమిది: సీఎం కేసీఆర్

## మీ ఊరికే వస్తాం.. మీ ధాన్యం కొంటాం

- కనీస మద్దతు ధర అందిస్తాం
- ధాన్యం డబ్బు ఖాతాల్లో వేస్తాం
- రైతులు ఆందోళన చెందొద్దు
- ఏప్రిల్ 10 వరకు నీటి విడుదల
- ఒక్క ఎకరం ఎండకూడదు
- మీడియాతో ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పండించిన ప్రతి గింజను మీ గ్రామానికి వచ్చి కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సీఎం కేసీఆర్ రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతాంగం అనవసర ఒత్తిడికి గురికావొద్దని, గత్తర బిత్తర కావొద్దని సూచించారు. 'నేనూ కాపోడినే, నాకు కూడా 20 ఎకరాల పొలం ఉన్నది, నా పంటను కూడా అమ్ముకోవాల్సి ఉన్నది' అని అన్నారు. మార్కెట్లు మొత్తం బంద్ చేశామని, ఒక్క రైతు కూడా మార్కెట్‌కు రావొద్దని చెప్పారు. మార్కెట్, వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో ఉంటారని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో రైతుబంధు సమితులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు కూడా కథానాయకులు కావాలన్నారు. రైతుల మధ్య ఉండాలని, రైతులను చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. మక్కలు, వరి, ఇతర పంటలు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పంట తీసుకొచ్చేటప్పుడు బ్యాంకు పాస్ బుక్ తీసుకురావాలని సూచించారు. ధాన్యం కొనుగోలు డబ్బును చెక్కుల ద్వారా

మిగతా 4వ పేజీలో

## అమెరికా హాహాకారం

### ఒక్కరోజులోనే 10వేలకుపైగా కేసులు

- 95వేలు దాటిన బాధితుల సంఖ్య
- వారంలోనే పదిరెట్లు పెరిగిన కేసులు
- ప్రపంచంలోనే మొదటిస్థానానికి
- 1,400 దాటిన మరణాల సంఖ్య
- బ్రిటన్ ప్రధానికి కరోనా వైరస్

**కరోనా** వైరస్ ధాటికి అమెరికా ఆగమాగం అవుతున్నది. ఒక్కరోజే దాదాపు 10వేల కొత్త కేసులు నమోదయ్యాయి. బాధితుల సంఖ్య 95వేలు దాటింది. దీంతో కేసుల సంఖ్యలో చైనాను దాటేసి మొదటిస్థానంలో నిలిచింది. అమెరికాలో వారంలోనే బాధితుల సంఖ్య పదిరెట్లు.. మరణాల సంఖ్య ఐదు రెట్లు పెరిగింది. మరోవైపు ఇటలీలో శుక్రవారం 969 మరణాలు నమోదయ్యాయి. వైరస్ మొదలైననాటినుంచి ఒక దేశంలో నమోదైన అత్యధిక మరణాలు ఇవే. మరోవైపు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్, ఆరోగ్యశాఖ మంత్రి మ్యాట్ హ్యాంకాక్‌కు కరోనా సోకింది. భారత్‌లో కరోనా బాధితుల సంఖ్య 724కు, మృతుల సంఖ్య 17కు పెరిగింది. గత రెండు నెలల్లో విదేశాల నుంచి మన దేశానికి దాదాపు 15 లక్షల మంది వచ్చారని కేంద్రం తెలిపింది. వారందరిపై కచ్చితంగా నిఘా ఉంచాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.

7


బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్



## కరోనా వైరస్‌పై ముందే హెచ్చరిక!

నిజమవుతున్న నోబెల్ గ్రహీత లెవిట్ అంచనాలు

7


లాక్‌డౌన్ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నిర్మానుష్యంగా మారిన ముంబైలోని రోడ్డు

## ఈఎంఐ వాయిదా

### 3 నెలలపాటు మారటోరియం విధించిన ఆర్బీఐ

- క్రెడిట్‌కార్డులు, పంటరుణాలు సహా అన్నిరకాల టర్మ్ లోన్లకు వర్తింపజేయండి
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రిజర్వ్‌బ్యాంక్ అనుమతి
- నిర్ణయాధికారం బ్యాంకులకే
- 16 ఏండ్ల కనిష్ఠానికి వడ్డీరేట్లు
- 3 శాతానికి నగదు నిల్వల నిష్పత్తి



8

**కరోనా** వైరస్ వ్యాప్తితో ఎదురవుతున్న కష్టాల నుంచి రుణగ్రహీతలకు ఊరట కల్పించాలని ఆర్బీఐ నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు వ్యవసాయ రుణాలు, రిటైల్ రుణాలు, పంట రుణాలు, వాహన లోన్లు, గృహ, కార్పొరేట్, విద్యా, వ్యక్తిగత రుణాలు సహా అన్ని రకాల టర్మ్ లోన్లకు, మూలధన రుణాలకు సంబంధించిన నెలవారీ కిస్తీల (ఈఎంఐల) చెల్లింపులపై మూడునెలలపాటు మారటోరియం విధించేలా బ్యాంకులకు, ఇతర ఆర్థిక సంస్థలకు ఆర్బీఐ అనుమతి ఇచ్చింది. క్రెడిట్‌కార్డులు సహా అన్ని రకాల రిటైల్ రుణ బకాయిలకు వర్తించే ఈ మారటోరియంను ఈ నెల 1 నుంచి మే 31 వరకు అమలుచేయాలని సూచించింది. జాతీయ, ప్రాంతీయ, సహకార బ్యాంకులతోపాటు గృహరుణాలు అందజేసే సంస్థలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు ఈ మారటోరియం పరిధిలోకి వస్తాయి.

## శాల్యూట్ తెలంగాణ

- కరోనా వైరస్ కట్టడిలో దేశానికే స్ఫూర్తిదాయకం
- ప్రజల ఐక్యత అద్భుతం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాను కట్టడి చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే స్ఫూర్తిగా నిలుస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. రాబోయేరోజులు మరింత క్లిష్టతరమైనవని, ప్రతి ఒక్కరూ కఠోరదీక్షతో కరోనా వైరస్‌ను పారదోలేందుకు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు చర్యలు ఫలితాలిస్తున్నాయని పేర్కొన్నారు. కరోనా కట్టడిలో వైద్యులు, మెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది, మీడియా, పోలీసులు, ప్రజల పాత్ర మరువలేనిదన్నారు. అన్ని వర్గాలు, ప్రజలు ప్రదర్శిస్తున్న ఐక్యత చూస్తుంటే శాల్యూట్ తెలంగాణ అని నోరారా చెప్పకుండా ఉండలేకపోతున్నానని పేర్కొన్నారు. వైరస్‌ను తుదముట్టించే దాకా ఎవరూ విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు అమలుచేస్తున్న చర్యలు సరిపోవని, ఇంకా కఠినంగా ఉండాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ మహమ్మారి దరిచేరకుండా ఎవరికివారు



మిగతా 5వ పేజీలో

"కరోనా తీవ్రత పెరిగితే ఈ జబ్బు బారినపడేవాళ్లలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి మొదలు ఎవరైనా ఉండవచ్చు. ఎవరూ దీనికి అతీతులు కాదు. అందుకే ఎవరూ బయటకు వెళ్లొద్దు. నిర్ణీత దూరం పాటించాలి.
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

లాక్‌డౌన్
డే-5

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 37°c | 22.9°c | ఆదిలాబాద్ | 36.8°c | 21.7°c |
| కరీంనగర్ | 37°c | 23°c | సిద్దిపేట | 36°c | 23°c |
| వరంగల్ (రూరల్) | 37°c | 23°c | ఖమ్మం | 39°c | 24°c |

## విరాళాల వెల్లువ

- సీఎంఆర్‌ఎఫ్‌కు అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ 2 కోట్లు, కోహినూర్ గ్రూప్ కోటి
- 'అనురాగ్' విరాళం 25 లక్షలు
- సీఎం కేసీఆర్‌కు చెక్కు అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో తెలంగాణ ప్రభుత్వానికి చేయూతనిచ్చేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సీఎం సహాయనిధికి రూ.రెండుకోట్లు ప్రకటించింది. ఆ సంస్థ డైరెక్టర్ ఉదయ్‌రెడ్డి శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు చెక్కును అందజేశారు. కోహినూర్ గ్రూప్ చైర్మన్ మహ్మద్ ఖాద్రీ రూ. కోటి చెక్కును సీఎం కేసీఆర్‌కు అందించారు. అనురాగ్ విద్యాసంస్థలు సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చాయి. ఈ చెక్కును విద్యాసంస్థల చైర్మన్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ముఖ్యమంత్రికి అందజేశారు. మాజీమంత్రి రెడ్డి సత్యనారాయణ తన రెండునెలల పెన్షన్‌ను ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ప్రకటించారు.



శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు అనురాగ్ విద్యాసంస్థల విరాళం అంగీకార పత్రాన్ని అందజేస్తున్న సంస్థల చైర్మన్, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## ఒక్కరి కడుపు కూడా మాడొద్దు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'మీ బిడ్డగా తెలంగాణ యావత్తు ప్రజలకు దండం పెట్టి చెప్తున్నా. ఒక మాట మీకు హామీ ఇస్తున్నా. తెలంగాణలో ఏ రాష్ట్రం వారు ఉన్నా, ఏ ప్రాంతం వారు ఉన్నా వారందరికి కడుపునిండా భోజనం పెడుతాం. ఎవరినీ ఎండబెట్టం. హాస్టల్ బంద్ చేయం' అని సీఎం కేసీఆర్ చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. రాష్ట్రంలోని గృహ నిర్మాణరంగంలో, నీటిపారుదలశాఖ కాంట్రాక్టర్ల వద్ద, రైస్ మిల్లులు, పౌల్ట్రీ ఇండస్ట్రీలో పని చేస్తున్నవారిలో ఇతర రాష్ట్రాల వారు ఎక్కువగా ఉంటారన్నారు. వారు రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని, వారి కడుపు మాడొద్దని కేసీఆర్ సూచించారు. గృహ నిర్మాణరంగానికి సంబంధించిన అసోసియేషన్లు మున్సిపల్‌శాఖ మంత్రిని కలిసి కార్మికులకు ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. తెలంగాణలో పేదలు, యాచకులు, నైట్ షెల్టర్లలో, అనాథశరణాలయాల్లో, వృద్ధాశ్రమాల్లో ఉండేవారు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారు, రకరకాల వృత్తుల్లో ఉన్నవారు, ఎవరైనా సరే వారు ఎట్టిపరిస్థితుల్లో ఆకలితో బాధపడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. అధికారులు ఖర్చుకు వెనకాడొద్దని చెప్పారు. జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ చుట్టూ ఉన్న పీర్జాదిగూడ, బోడుప్పల్, బడంగ్‌పేట, నిజాంపేట, బండ్లగూడ జాగీరు, జల్‌పల్లి, మీర్‌పేట, జవహర్‌నగర్‌లో ఎక్కువగా ఇతర రాష్ట్రాలవారు, కూలీలు ఉన్నారని.. మున్సిపల్‌శాఖ మంత్రి, అధికారులు కలిసి వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఏపీకి సంబంధించిన పిల్లలు కొంత అయోమయానికి గురవుతున్నారని అన్నారు. హాస్టళ్లను మూసివేయబోరని కేసీఆర్ స్పష్టం చేశారు. విద్యార్థులు ఇక్కడే ఉండాలని సూచించారు. దేశంలో హైఎండ్ టెక్నాలజీ లేదని, వేలకొద్ది వెంటిలేటర్లు లేవని, వ్యాప్తిని నిరోధించడమే మనకు పెద్ద మందు అని చెప్పారు. యావత్తు ప్రపంచమే యుద్ధంలో పాల్గొంటున్న పరిస్థితి ఉన్నదని, దేశం మొత్తం కర్ఫ్యూలోనే ఉన్నదని, ఇలాంటి పరిస్థితిని చరిత్రలో ఏనాడూ చూడలేదని సీఎం చెప్పారు.

# మీకోసం నేనున్నా

మూడోపేజీ తరువాయి...

సంఖ్య 59కి చేరిందని, ఇందులో ఒకరికి వ్యాధి నయమై ఇంటికి వెళ్లారని తెలిపారు. ప్రస్తుతం 58 మందికి చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 20వేల మంది ప్రభుత్వం ఏర్పాటుచేసిన వసతుల్లో లేదంటే హోం క్వారంటైన్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. విదేశాలనుంచి వచ్చి క్వారంటైన్‌లో ఉంటున్న వారిపై నిఘా పెట్టి, తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 'ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా.. చాలా మంచి సహకారం అందిస్తున్నారు. ఇలా అందరి సహకారం లేకపోతే పరిస్థితి చాలా భయంకరంగా ఉండేది. మనందరి బతుకులు ప్రమాదంలో పడేవి' అని సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో లాక్‌డౌన్ చేసి రాత్రిళ్లు కర్ఫ్యూ అమలుచేస్తున్నా ఒక్కరోజే 14 పాజిటివ్ కేసులు నమోదయ్యాయంటే ప్రజలు పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తిచేశారు. 'అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలో 11 వేల వెంటిలేటర్లు ఉన్నాయి. ఒక్క న్యూయార్క్ సిటీలోనే 3 వేల వెంటిలేటర్లు ఉన్నాయి. కానీ ఈ రోజు వారికి 30 వేల వెంటిలేటర్లు అవసరం. అమెరికాలాంటి దేశమే ఆగమాగం అయ్యే పరిస్థితిలో ఉన్నది. అన్ని వసతులు, అంత ధనం, సిబ్బంది, పవర్ ఉన్న అమెరికా పరిస్థితే అట్లా ఉన్నదంటే ప్రజలు అర్థం చేసుకోవాలి' సీఎం కేసీఆర్ అన్నారు.

### నిర్ణీత దూరం పాటించడమే ఏకైక ఆయుధం

ప్రస్తుత పరిస్థితిలో ఒకరికొకరు నిర్ణీత దూరం (సోషల్ డిస్టెన్స్) పాటించడమే మనదగ్గర ఉన్న ఏకైక ఆయుధమని సీఎం కేసీఆర్ అన్నారు. గుంపులుగా వీధుల్లోకి రాకుండా స్వీయ నియంత్రణ, పరిశుభ్రతను పాటించడం మినహా మరోదారి లేదని చెప్పారు. అమెరికా, చైనా, స్పెయిన్, ఇటలీస్థాయిలో భారత్‌లో కూడా కరోనావ్యాపిస్తే 20 కోట్ల మంది జబ్బు బారిన పడే అవకాశం ఉన్నదని జాన్ అప్టిన్స్, వరల్డోమీటర్, డబ్ల్యూహెచ్‌వో ఇలా రకరకాల నివేదికలు చెప్తున్నాయన్నారు. కరోనా తీవ్రత పెరిగితే ఈ జబ్బు బారినపడేవాళ్లలో ప్రధాని, ముఖ్యమంత్రి మొదలు ఎవరైనా ఉండవచ్చని, ఎవరూ దీనికి అతీతులు కారని చెప్పారు.

### బాగా చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు

శుక్రవారం ఉదయం తాను ప్రధానమంత్రి గారితో చాలాసేపు మాట్లాడినట్టు సీఎం కేసీఆర్ చెప్పారు. '24 గంటలపాటు అందుబాటులో ఉంటాను. ఏ సమయంలో ఎలాంటి సహకారం కావాలన్నా.. వందశాతం మేం మీతో ఉంటాం. ఇప్పుడు మీరు బాగా పనిచేస్తున్నారు. ఇకముందు కూడా ఇదే స్ఫూర్తితో గట్టిగా చర్యలు తీసుకోండి' అని మోదీ చెప్పినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు.

### ప్రజాప్రతినిధులు గుంపులుగా పోవొద్దు

ప్రజాప్రతినిధులు ఇంటి దగ్గర ఉంటున్నారని కోపానికి వస్తే బయలుదేరి వందలు వందలు పోతున్నారని, కుప్పలు కుప్పలుగా పోయి ప్రజలకు కొత్త సమస్యలు తేవొద్దని ప్రజాప్రతినిధులకు సీఎం సూచించారు. ఒక్కరుగా పోవాలని, కూరగాయలు బ్లాక్ మార్కెట్ కాకుండా పర్యవేక్షించాలని, ప్రజలకు అండదండగా ఉండాలని సూచించారు.

### రాక్షసితో యుద్ధం

'కరోనా ఎంత భయంకరమైన వ్యాధో.. అర్థం చేసుకుంటే అంత సింపుల్. ప్రపంచంలో ఈ వ్యాధికి మందులేదు. అది పెద్ద బలహీనత. యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న బలహీనత. కరోనా వ్యాప్తిని నిరోధించడమే ఈ పరిస్థితుల్లో పెద్ద మందు. అందుకే ప్రజలకు నేను మరోసారి రెండు చేతులు జోడించి చెప్తున్నా.. స్వీయ నియంత్రణే మనకు శ్రీరామరక్ష. ఈ ఆపత్కాల సమయంలో మరేదీ మనల్ని కాపాడదు. గుంపులుగా రోడ్లపైకి రావొద్దు. ఏమైతదిలే.. అనే నిర్లక్ష్యం ఎంతమాత్రం పనికిరాదు. మనం కరోనా అనే భయంకరమైన రాక్షసితో యుద్ధం చేస్తున్నాం. ఈ సమయంలో అలసత్వం, నిర్లక్ష్యం పనికిరాదు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని ఇబ్బందులున్నా ప్రజలు ఓర్చుకోవాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.

### నిత్యావసరాల వాహనాలకు అనుమతి

రాష్ట్రంలో లాక్‌డౌన్ ఉన్నా.. పాలు, కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసరాల వాహనాలకు అనుమతిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. డెయిరీ ఫాంలోకి పశుగ్రాసాన్ని అనుమతిస్తారన్నారు. రాష్ట్ర ప్రజలకు అవసరమైన పాలు రావాలంటే పశుగ్రాసం తప్పనిసరని, డెయిరీఫాం యాజమానులు ఇప్పటివరకు పశుగ్రాసం సరఫరా చేసిన వారి దగ్గరి నుంచి పశుగ్రాసాన్ని తీసుకోవచ్చని చెప్పారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు సంబంధించిన వాటికి అనుమతులుంటాయని, సోయా కేక్ ఇతర రాష్ట్రాల నుంచి వస్తుందని, చికెన్, కోడిగుడ్లు కూడా ఇతర రాష్ట్రాలకు వెళ్తాయని, వీటన్నింటినీ అనుమతిస్తామన్నారు.

### ప్రజలు సహకరించాలి

ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య, పోలీసు, ప్రభుత్వ సిబ్బంది నిద్రలేకుండా పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రజలు వారికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇది ఒక్కటే కాకుండా అనేక అంశాలపై తాము, ప్రభుత్వ అధికారులు కూడా రాత్రి పగలు అనే తేడా లేకుండా పనిచేస్తున్నామన్నారు. పిల్లలకు పాలు, ప్రజలకు కూరగాయలు రవాణా జరగాలని, ఇలా చాలా ఇబ్బందులు ఉన్నాయని, వాటన్నింటిని తొలగిస్తున్నామని తెలిపారు. అవసరమైన వాటికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని చెప్పారు.



వైరస్ విస్తరణ, చికిత్సలో దశలను వివరిస్తున్న సీఎం కేసీఆర్

## మూడు దశల్లో చికిత్స

కరోనా బారినపడినవారికి చికిత్స అందించడంలో ప్రపంచవ్యాప్తంగా మూడుదశల వ్యూహాన్ని అవలంబిస్తున్నారని సీఎం కేసీఆర్ తెలిపారు. 'కరోనా సోకినవారిలో 80.9 శాతం మందికి తీవ్రమైన ప్రమాదం రాదు (మైల్డ్ కేసులు). వీరు బతికేందుకు చాలా అవకాశాలుంటాయి. ఇక 13.8 శాతం మందిని సివియర్‌గా గుర్తిస్తారు. వీరికి జబ్బు కొంత హెచ్చుస్థాయిలో ఉంటుంది. 4.7 శాతం మంది క్రిటికల్ స్థితిలో ఉంటారు. వీరిని ఐసీయూలో ఉంచి వెంటిలేటర్, ఆక్సిజన్ పెట్టి చికిత్స అందించాలి. ఇలాంటి విధానం ప్రపంచం మొత్తం అవలంబిస్తున్నది' అని సీఎం కేసీఆర్ వివరించారు. కొన్ని దేశాల్లో జబ్బుబారిని పడుతున్న వారిసంఖ్య పెరిగినప్పుడు 80.9 శాతం మందిని వాళ్ల ఇండ్ల దగ్గరే ఉంచి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. మిగిలిన రెండు క్యాటగిరీల్లో 13.8 శాతం మందిని ఐసొలేషన్ వార్డుల్లో, 4.7 శాతం మందిని క్రిటికల్ కేర్ యూనిట్లలో ఉంచి పూర్తిస్థాయి వైద్య పర్యవేక్షణలో పెడుతున్నట్టు పేర్కొన్నారు.



హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో సిద్ధమవుతున్న క్వారంటైన్ కేంద్రం

## వందమంది అవసరముంటే
## 130 మంది సిద్ధం

ఒకవేళ కరోనా మన రాష్ట్రంలోనూ ప్రబలితే ఏం చర్యలు తీసుకోవాలన్నదానిపై ఇప్పటికే ఆరోగ్యశాఖ మంత్రి, సీఎస్, ఇతర వైద్యశాఖ ఉన్నతాధికారులతో చర్చించినట్టు సీఎం కేసీఆర్ తెలిపారు. వ్యాధి ప్రబలితే ఇంకొకరిపై ఆధారపడకుండా మనకున్న వసతులు, వైద్య సిబ్బందితో కలిసి ఎంతవరకు ఎదుర్కోగలుగుతామన్న విషయంపైనా చర్చించినట్టు చెప్పారు. 'వందమంది వైద్య సిబ్బంది అవసరమైతే 130 మందిని మనం సిద్ధంగా పెట్టుకోవాల్సి ఉంటుంది. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లుతోపాటు ఇతర సిబ్బంది.. వారికి వసతి, భోజనాలు, రవాణా వాహనాలు ఇలా పూర్తిస్థాయిలో ప్రణాళికలు వేసుకొని ప్రభుత్వం వందశాతం సంసిద్ధంగా ఉన్నది. మొత్తం 11 వేలమందిని ఐసొలేషన్ వార్డులో పెట్టుకొనేలా ప్లాన్ చేసుకున్నాం. 1400 క్రిటికల్ కేర్ బెడ్లను సిద్ధం చేశాం. గచ్చిబౌలి స్టేడియంలో ఇందుకోసం అన్ని ఏర్పాట్లు రెండురోజుల్లో పూర్తవుతాయి. గాంధీ మెడికల్ కాలేజీలో ఆక్సిజన్ లైన్లు ఏర్పాటుచేస్తున్నాం. కింగ్‌కోఠి దవాఖానలో కూడా అవసరమైన ఏర్పాట్లుచేస్తున్నాం' అని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇప్పటికే 500 వెంటిలేటర్లకు ఆర్డర్ ఇచ్చామని, వాటిలో కొన్ని అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇప్పటికిప్పుడు 12,400 మంది ఇన్‌పేషెంట్లుగా ఉన్నా వారికి వైద్యం అందించేలా ప్రభుత్వం సన్నద్ధంగా ఉన్నదన్నారు. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 60వేల మందికిచేరినా వారికి వైద్యం అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

### రిటైర్డ్ సిబ్బందిని సమాయత్తం చేస్తున్నాం

పదవీ విరమణ పొందిన సుమారు 11 వేలమంది డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర వైద్య సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పత్రికా ప్రకటనలు సైతం ఇచ్చారని, వారి సేవలు వాడుకొనేలా పూల్స్ సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే 8 వేలమంది వైద్యులు ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్నారని, వారు కాకుండా అదనంగా పని చేసేందుకు 60 ఏండ్లలోపు రిటైర్డ్ వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లతోపాటు ఇప్పుడిప్పుడే పీజీ కోర్సులు పూర్తిచేసిన వారు 11 వేల మంది, ఎంబీబీఎస్ పూర్తిచేసి పీజీ కోర్సుల్లో ఉన్న సుమారు 3 వేల మంది, ఇలా అందరినీ కలిపి 14 వేల మంది వరకు అదనపు వైద్య సిబ్బందిని సమీకరిస్తున్నట్టు తెలిపారు. వ్యాధి విజృంభించినా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు.

## ప్రైవేటు ల్యాబుల్లో పరీక్షలుండవు



కరోనాను పరీక్షించడానికి ఐసీఎమ్మార్ సంస్థ రాష్ట్రంలోని ప్రైవేటు సంస్థలకు అనుమతిచ్చిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటికి అనుమతి ఇవ్వలేదని సీఎం కేసీఆర్ తెలిపారు. విజయ డయాగ్నస్టిక్, అపోలో, విమ్టాల్యాబ్‌లకు రాష్ట్రం అనుమతి ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం ప్రభుత్వ సంస్థలు టెస్టింగ్ చేయలేవని అనుకున్నప్పుడు మాత్రమే వాటికి అనుమతిస్తామన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన వాటిల్లో ఐదింటికి అనుమతులు వచ్చాయని, మరోదానికి అనుమతి వస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఆరు ల్యాబ్‌లు, సీసీఎంబీ కూడా సరిపోకుంటే ప్రైవేటు వాటికి అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. సీసీఎంబీలో రోజుకు 800 శాంపిళ్లకు పరీక్షించే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రజలను అనవసర దోపిడీ నుంచి తప్పించడానికి ప్రైవేటు సంస్థలకు అనుమతులు ఇవ్వరాదని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. మొదటి దశలో ప్రభుత్వ దవాఖానల్లోనే పరీక్షలు, చికిత్స చేస్తామన్నారు. అప్పటికి సరిపోకుంటే ప్రైవేటుకు పోతామన్నారు. రెండోదశలో ప్రైవేటు మెడికల్ కాలేజీలను వాడుకుంటామని చెప్పారు.

### ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధం

రాష్ట్రంలో కరోనా నియంత్రణలోనే ఉన్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. విమానాల రాకపోకలు నిలిచిపోయాయని, అంతర్జాతీయ ప్రయాణికుల ద్వారా వ్యాధి మనకు వచ్చే పీడపోయిందన్నారు. ఇప్పుడ ఒకరికి ఒకరు అంటిచ్చే బాపతున వస్తుందని, ఇక నుంచి పెరిగే స్టేజ్ అదేనని చెప్పారు. కొందరు మూర్ఖంగా, అమాయకంగా తెలియక ప్రవర్తించడం వల్ల వచ్చిందన్నారు. గ్రామాల్లో మా ఊరికి ఎవ్వరు రావొద్దని కంచెలు పెట్టుకున్నారని, ఇది కొంత మంచిదే అయినా ఇంకో రకంగా చెడ్డదని చెప్పారు. గ్రామానికి అత్యవసరంగా రావాలంటే ఇబ్బంది ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలు అమ్మకాలు జరగాల్సి ఉంటుందని, దీనికోసం వాహనాలు రావాల్సి ఉంటుందని చెప్పారు. అవసరమైన సందర్భాల్లో రాళ్లు, కంచెలను కొంతవరకు తొలగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉన్నదని, మనకు పెద్ద ఇబ్బంది లేదన్నారు. ఇంకా అత్యవసరమైతే సాయం చేయడానికి అండదండగా ఉంటామని ప్రధానమంత్రి చెప్పారన్నారు. మన ఐకమత్యం, మన తెలివితేటలు వ్యాప్తిని అరికడుతాయన్నారు. ప్రజలు ఇక ముందు కూడా ఇదే సహకారాన్ని కొనసాగించాలన్నారు.

## రోగ నిరోధక శక్తి పెంచే ఆహారాన్ని తీసుకోండి

చికెన్ తింటే కరోనా వస్తుందని కొందరు తప్పుడు ప్రచారం చేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. చికెన్, గుడ్లు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. వ్యాధిని అడ్డుకోవాలంటే వ్యాధి నిరోధక శక్తిని, శరీర దారుఢ్యాన్ని పెంచుకోవాలన్నారు. సీ విటమిన్ ఉండే నిమ్మకాయలు, సంత్రాలు, బత్తాయి పండ్లు, దానిమ్మపండ్లను ఎక్కువగా తినాలని సూచించారు. నల్లగొండ, ఇతర జిల్లాల్లో బత్తాయి పండ్లు పండుతాయని, వాటిని వేరే రాష్ట్రాలకు ఎగుమతి చేయొద్దని, మన రాష్ట్ర అవసరాలకే వినియోగించుకోవాలని చెప్పారు. అన్ని కాలనీల్లో, రైతు బజార్లలో ప్రత్యేక అనుమతులిచ్చి విక్రయించాలని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మామిడి పండ్లు కూడా ఎక్కువగా తినాలని, పండ్లను జిల్లా, తాలుకా కేంద్రాలకు, పట్టణాలకు పంపించాలని సీఎం కేసీఆర్ సూచించారు.



లోకం పోకడ




## మీ ఊరికే వస్తాం.. మీ ధాన్యం కొంటాం

మూడోపేజీ తరువాయి...

రైతు ఖాతాల్లో వేస్తామని చెప్పారు. వెంటనే డబ్బులు వస్తాయని రైతులు అనుకోవద్దని, ప్రభుత్వం ఒక నెలలోపు జమ చేస్తుందన్నారు. పంటలను కొనుగోలు చేయడానికి దాదాపు రూ.35 వేల కోట్లు అవసరం ఉంటుందని, దీని కోసం ఆర్బీఐతో మాట్లాడుతున్నామని చెప్పారు. ఎఫ్‌సీఐకి ఇచ్చినా అక్కడినుంచి డబ్బు రావడానికి కొంత సమయం పడుతుందని, ఈ విపత్కర పరిస్థితులో కొంత సర్దుబాటు అవసరమన్నారు. కొన్న పంటలను ప్రభుత్వం నిర్మించిన గోడౌన్లలో పెడుతామని, అవి సరిపోకుంటే తాత్కాలికంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో నిల్వచేస్తామని తెలిపారు. వ్యాపారులు ఊర్లలోకి పోయి కొంటామంటే కొనుగోలు చేయచ్చని, అయితే కనీస మద్దతు ధరకే కొనాలని సూచించారు. మార్కెట్లను మూసివేశామని దీనిపై సీఎస్, వ్యవసాయశాఖ కార్యదర్శి.. కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. మళ్లీ ఆదేశాలు ఇస్తారని, దీనిపై ఆదివారం సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ల, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు సీఎం కేసీఆర్ వెల్లడించారు.

### పంటలకు ఏప్రిల్ 10 వరకు నీటివిడుదల

రాష్ట్రంలో రైతులు 50 లక్షలకుపైగా ఎకరాల్లో పంటలు వేశారని, పంటలు చేతికొచ్చే సమయం వచ్చిందని సీఎం కేసీఆర్ చెప్పారు. పంటలొస్తేనే మనకు అన్నం దొరుకుతుందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ, కాళేశ్వరం, నాగార్జునసాగర్, జూరాల ఆయకట్టు కింద పంటలకు అవసరమైన నీటిని ఏప్రిల్ 10 వరకు విడుదలచేస్తామని ప్రకటించారు. చివరి ఎకరం కూడా ఎండకుండా పండాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టంచేశారు. కల్వకుర్తి, దేవాదుల ఎత్తిపోతల ద్వారా కూడా ఏప్రిల్ 10 వరకు నీటిని విడుదలచేస్తామని వెల్లడించారు. వాస్తవంగా ఈ నెల 31 వరకే నీటిని విడుదలచేయాలని అనుకున్నామని చెప్పారు. అయితే మంత్రులు ఈటల, వేముల, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్, నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడానని, మరో పదిరోజులు పొడిగించాలని వారు కోరారన్నారు. దేవుడి దయవల్ల నీటి కొరతలేదని, విడుదలచేస్తామని తెలిపారు. రైతులు, శాసనసభ్యులు, రైతుబంధు సమితి సభ్యులు సమన్వయం చేసుకొని నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్క ఎకరం ఎండకుండా పంట పండించుకోవాలన్నారు. రాష్ట్రంలో బావులు, బోర్ల మీద ఆధారపడి కూడా పంటలు సాగుచేశారని, ప్రస్తుతం విద్యుత్ 9,832 మెగావాట్ల డిమాండ్ ఉన్నదని చెప్పారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మంచి ప్రకటన చేశారని, విద్యుత్ సిబ్బంది మరో 15 రోజులు కష్టపడి పనిచేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చేస్తే ఆ తరువాత విద్యుత్ డిమాండ్ తగ్గుతుందన్నారు. ప్రజలకు విద్యుత్ సిబ్బంది గొప్ప సేవ చేస్తున్నారని ప్రశంసించారు. నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసి పంటలు చేతికొచ్చేలా సహకరించాలని కోరారు.

### మంత్రి వేముల హర్షం

ఎస్సారెస్పీ ఆయకట్టు రైతుల కోసం వచ్చే నెల పదో తేదీ వరకు సాగునీరు అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఎన్నడూ లేని విధంగా ఎస్సారెస్పీ పరిధిలో పంటల సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ప్రపంచమంతా కరోనాపై యుద్ధంచేస్తున్న వేళ.. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసం అన్నిరకాల ముందు జాగ్రత్తలు తీసుకొంటున్నదని చెప్పారు. గ్రామాల్లోనే ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లుచేసినందున రైతులెవరూ మార్కెట్ కేంద్రాలకు రావద్దని విజ్ఞప్తి చేశారు.



సమస్త స్వైర విజృంభణానికి విద్రోహ శక్తిగా
కన్నీటి శోకాల రాక్షస ఘట్టానికి వినాశన మంత్రంగా
వైరస్ ఆవాస నిర్వీర్యానికి
తుది కరవాలం.. ఈ క్వారంటైన్

డాక్టర్ వంగర త్రివేణి

# హైకోర్టు కేసుల విచారణ రద్దు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్ని కార్యకలాపాలను ఏప్రిల్ 14 వరకు రద్దుచేస్తున్నట్టు హైకోర్టు శుక్రవారం ప్రకటించింది. అత్యంత ముఖ్యమైన పిటిషన్లను సోమ, బుధ, శుక్రవారాల్లో వీడియోకాన్ఫరెన్స్ లేదా స్కైప్ ద్వారా పరిష్కరించనున్నట్టు వెల్లడించింది. ఏదైనా అత్యవసర పిటిషన్లు ఉంటే ఈమెయిల్ ద్వారా రిజిస్ట్రార్ జనరల్‌కు పంపాలని సూచించింది. వీటిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతించినవాటిని ఆయా బెంచ్‌లకు కేటాయిస్తూ హైకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచుతారు. లిస్ట్ అయిన కేసులకు సంబంధించిన వివరాలను పిటిషనర్ల ఫోన్‌కు ఎస్సెమ్మెస్ పంపిస్తారు.

**స్టే ఉత్తర్వులు జూన్ 7 వరకు పొడిగింపు**

న్యాయవ్యవస్థ లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికే హైకోర్టు, కింది కోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను జూన్ 7వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్టు హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డితో కూడిన ఫుల్‌బెంచ్ ఆదేశాలు జారీచేసింది. దీనివల్ల ఎవరికైనా తీరని అన్యాయం జరిగిందని భావిస్తే సంబంధిత కోర్టుల ద్వారా తగిన ఉత్తర్వులు పొందవచ్చని స్పష్టంచేసింది.

# శాల్యూట్ తెలంగాణ

> మూడోపేజీ తరువాయి...

వ్యక్తిగత క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని వివరించారు. ఇంటినుంచి ఎవరూ బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కఠినతర స్వీయ నియంత్రణే మానవాళికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

**కరోనాపై పోరుకు పల్లెప్రగతి స్ఫూరి**

కరోనాపై రాష్ట్ర ప్రజలు సమిష్టిగా సాగిస్తున్న పోరాటానికి పల్లెప్రగతి కార్యక్రమాలు స్ఫూర్తినిచ్చాయని వినోద్‌కుమార్ అన్నారు. ప్రతి అంశంలో సీఎం కేసీఆర్ దూరదృష్టితో అమలుచేస్తున్న కార్యక్రమాలు మన కండ్ల ఎదుట సాక్షాత్కరిస్తున్నాయన్నారు. కరోనా వైరస్ గ్రామాలు, కాలనీల్లో వ్యాప్తి చెందకుండా ఆయా ప్రాంతాలవారు బయటివ్యక్తులు రాకుండా దిగ్బంధనం వంటి కార్యక్రమాలు చేపడుతుండటం హర్షణీయమని పేర్కొన్నారు. మహమ్మారిని అంతమొందించే వరకు ఇదే స్ఫూర్తిని కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉన్నదని చెప్పారు.

# రైతుల్లో విశ్వాసం కల్పించిన సీఎం

## సీపీఐ నారాయణ ప్రశంసల జల్లు



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో లాక్‌డౌన్ విధించినప్పటికీ రైతులు, వ్యవసాయ కూలీలు, పట్టణాల్లోని పేదల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు వారిలో విశ్వాసం కల్పించాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. వ్యాధిగ్రస్తులను ప్రైవేటు ల్యాబ్ లు దోపిడీ చేయకుండా సీఎం తగిన జాగ్రత్తలు తీసుకున్నారని కొనియాడారు. గాంధీ ద వాఖాన తరహాల్లో జిల్లాస్థా యిలో ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ చేసిన వాగ్దానాన్ని అమలుచేసి ధన్యుడు కావాలని ఆ కాంక్షించారు.

# సీఎం కేసీఆర్‌కు అభినందనలు

## కరోనా కట్టడికి ప్రభుత్వ చొరవ సమర్థనీయం:మందకృష్ణ



ఖైరతాబాద్: కరోనా మహమ్మారిని అరికట్టడం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. కరోనా వ్యాప్తికి ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను ప్రతి ఒక్కరూ సమర్థించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. నిర్ణీత దూరాన్ని పాటించాలని విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో.. జైళ్లలో ఉన్న ఖైదీలకు సైతం అది వర్తింపజేయాలని విజ్ఞప్తిచేశారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఖైదీలను విడుదలచేశాయని తెలిపారు. అవసరమైనవారిని బెయిల్ ద్వారాగానీ, పెరోల్‌పైగానీ విడుదల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవాలని మందకృష్ణ కోరారు.

## • ఇండ్లల్లోనే ముస్లింల ప్రార్థనలు



ప్రతి శుక్రవారం మధ్యాహ్నం వేల మందితో కళకళలాడే చారిత్రక మక్కా మసీదు బోసిపోయింది. కరోనా వ్యాప్తి నియంత్రణకు ఇండ్లలోనే నమాజ్ చేసుకోవాలంటూ ముస్లిం మతపెద్ద మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ సిద్దిఖీ, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ సలీం, మైనార్టీ కమిషన్ చైర్మన్ ఖమరుద్దీన్ పిలుపునిచ్చారు. దీంతో శుక్రవారం ముస్లిం సోదరులు ఇండ్లలోనే నమాజ్ చేశారు. మక్కామసీదు సహా అనేక మసీదుల్లో గరిష్ఠంగా ఐదారుగురు మాత్రమే వెళ్లి నమాజ్‌చేశారు. వైరస్ నియంత్రణలోకి వచ్చేవరకు ఇండ్లలోనే ప్రార్థనలు చేసుకొంటూ జాగ్రత్తగా ఉండాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ/చార్మినార్

# ఆపదలో ట్వీట్ కరోనా!

- ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్న మంత్రి కేటీఆర్
- దేశ, విదేశాల్లో ఉన్నవారికి అత్యవసర సేవలు
- ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్యలకు పరిష్కారం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారి వణికిస్తున్న సమయంలో ఆపదలో ఉన్న తెలంగాణ బిడ్డలు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా సాంత్వన దొరుకుతున్నది. దేశవ్యాప్తంగా అత్యవసరంగా లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో పలువురు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం దొరుకుతున్నది. రాష్ట్రంలో అత్యవసర సమయాల్లో అభాగ్యులకు భరోసా లభిస్తున్నది. వీటన్నింటికీ ట్విట్టర్ వేదికవుతున్నది. ఐటీ, పరిశ్రమలు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రిగా కే తారకరామారావు తన బాధ్యతల్లో నిరంతరం శ్రమిస్తూనే.. ట్విట్టర్ వేదికగా దేశ, విదేశాల్లో ఉన్నవారి సమస్యలకూ పరిష్కారం చూపుతున్నారు. 'ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తిచేసిన వెంటనే స్పందించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు' అంటూ పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీతా క్రిష్ణన్ మంత్రి కేటీఆర్‌ను ప్రశంసించారు. 'శస్త్రచికిత్సలు చేయించి ప్రాణాలు కాపాడాలంటూ.. విదేశాల్లో చిక్కుకున్నవారిని రక్షించాలంటూ పలువురు చేస్తున్న విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందిస్తున్నందుకు ధన్యవాదాలు. మీరు చేసే పనులు కేంద్ర మాజీమంత్రి సుష్మా స్వరాజ్‌ను గుర్తుచేస్తున్నాయి. ఇలాంటి నాయకులు ఉండటం మాకెంతో గర్వకారణం' అంటూ ఆమె ట్వీట్ చేయడం మంత్రి కేటీఆర్ చూపుతున్న ఔదార్యానికి నిదర్శనం.

**ఇటలీ విద్యార్థుల విజ్ఞప్తికి స్పందన**

ఇటలీలో చిక్కుకుపోయామని, సహాయం చేయాలంటూ తెలుగురాష్ట్రాల విద్యార్థులు మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. వెంటనే స్పందించిన కేటీఆర్.. కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఇటలీలోని ఇండియన్ ఎంబసీ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వైద్య విద్యకోసం వెళ్లి కజకిస్థాన్‌లో చిక్కుకుపోయిన 14మందిని కూడా కాపాడాలని కేంద్రమంత్రిని, అక్కడి ఎంబసీని కోరారు. ముంబైలో చిక్కుకున్న పలువురు తెలంగాణవాసులకు సహాయం చేయాలంటూ మహారాష్ట్ర మంత్రి ఆదిత్య ఠాక్రేను మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా కోరారు. కరోనా కట్టడికి మద్దతివ్వాలంటూ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా చేసిన విజ్ఞప్తితో సినీతారలు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు సీఎం సహాయనిధికి రూ.కోట్లు విరాళంగా అందజేస్తున్నారు.

## లాక్‌డౌన్ బాధితులకు భరోసా




కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం గుండ్లపాడ్ శివారులో సింగరేణి ఆధ్వర్యంలో చేపడుతున్న సోలార్‌ప్లాంట్‌కు సామగ్రి అన్‌లోడ్ చేసేందుకు వచ్చి చిక్కుకుపోయిన తమిళనాడు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ కూలీలను ఆదుకోవాలంటూ వారి బంధువులు చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ స్పందించారు. వెంటనే ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ట్విట్టర్ ద్వారానే సమస్య తెలిపి.. పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక పోలీసుల ద్వారా వారికి ఏప్రిల్ 15 వరకు కావాల్సిన నిత్యావసర వస్తువులను సమకూర్చారు. సమస్య పరిష్కారమయిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ట్వీట్ చేయగా.. 'థ్యాంక్యూ ఎమ్మెల్యే సాబ్' అంటూ కేటీఆర్ రీట్వీట్ చేశారు.

## చిన్నారికి మందులు అందజేత



మెడిసిన్ అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

నయీంనగర్: లాక్‌డౌన్ కారణంగా వరంగల్ నగరంలోని కాజీపేటకు చెందిన నాలుగేండ్లబాలుడికి హైదరాబాద్ నుంచి కొరియర్‌లో రావాల్సిన మూర్ఛ వ్యాధి మందు ఆగిపోయింది. విషయాన్ని బాలుడి బంధువు విజయ్ ట్విట్టర్ ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కేటీఆర్.. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు సమాచారం అందించారు. బాలుడి తల్లిదండ్రులు రాకేశ్, శృతితో మాట్లాడిన వినయ్‌భాస్కర్ శుక్రవారం హైదరాబాద్ నుంచి మందుతెప్పించారు.

## సరిహద్దు నుంచి సొంతూళ్లకు..

ఎల్లారెడ్డిపేట: మహారాష్ట్రలోని ఉద్గిరిలో ఓ ప్రైవేటు కంపెనీలో అగ్రికల్చర్ టెక్నిక్ కోచింగ్ కోసం వెళ్లిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లితోపాటు, జగిత్యాలకు చెందిన యువకులను స్వగ్రామాలకు పంపేందుకు కంపెనీ ప్రతినిధులు సిద్ధమయ్యారు. వారి వాహనాన్ని గురువారం కామారెడ్డి జిల్లా మద్నూర్ చెక్‌పోస్ట్ వద్ద నిలిపివేశారు. గొల్లపల్లికి చెందిన పల్లకొండ శివ టీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి తోట ఆగయ్యకు సమస్యను వివరించగా, ఆయన మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సూచనతో యువకులకు వైద్యపరీక్షలు నిర్వహించి స్వగ్రామాలకు తరలించారు.

**స్వగ్రామానికి గర్జనపల్లి వాసి!**

వీర్నపల్లి : రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి కృష్ణ హైదరాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ కుటుంబసభ్యులతో కలిసి ఉప్పల్‌లో నివసిస్తున్నాడు. లాక్‌డౌన్ విధించడంతో వాహనసదుపాయంలేక ఇబ్బందులు పడుతున్నానని, తన ఇద్దరు చిన్నారులతో సొంతూరుకు వెళ్లేందుకు సాయం చేయాలంటూ మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. మంత్రి కార్యాలయ సిబ్బంది సూచనతో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గుగులోతు కళావతి సురేశ్‌నాయక్ ఓ ప్రైవేటు వాహనాన్ని హైదరాబాద్‌కు పంపించారు.

## 62 మందికి కరోనా నిర్ధారణ పరీక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌నగరంలో మరో 62 మంది అనుమానితులకు ముందుజాగ్రత్త చర్యగా శుక్రవారం కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గాంధీ మెడికల్ కళాశాల పరిధిలోని వైరాలజి ల్యాబ్‌లో రాత్రి 8 గంటలవరకు 42 మందికి, ఉస్మానియా మెడికల్ కళాశాల పరిధిలోని ల్యాబ్‌లో సాయంత్రంవరకు 20 మంది అనమానితులకు కొవిడ్-19 నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యశాఖ అధికారులు వివరించారు. వీరికి సంబంధించిన వైద్యపరీక్షల నివేదికలు శనివారం వస్తాయని తెలిపారు.

# అనుక్షణం అప్రమత్తం

## అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉన్న రాష్ట్రం మనదే
## వైద్యసేవల ఏర్పాట్లలో ముందున్నాం: మంత్రి ఈటల



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. వైరస్ పాజిటివ్, అనుమానిత లక్షణాలున్నవారికి వైద్యసేవలు అందించడంలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉన్నదన్నారు. శుక్రవారం కోఠిలోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ప్రైవేటు వైద్యకళాశాలల యాజమాన్య ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. చైనాలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నదన్న వార్తలు వచ్చిన రోజు నుంచి వైద్యశాఖను సీఎం కేసీఆర్ అప్రమత్తం చేశారని, ఆ రోజు నుంచి నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. పాజిటివ్ కేసులను గుర్తించి చికిత్స అందిస్తున్నామని, వీరిలో ఒకరు ఇప్పటికే ఇంటికి వెళ్లారని, శనివారం నుంచి మరికొంత మందిని డిశ్చార్జ్ చేయనున్నట్టు తెలిపారు. ఇతర దేశాల్లో లాగా మన రాష్ట్రంలో పాజిటివ్ వ్యక్తుల ద్వారా ఇతరులకు సోకలేదని చెప్పారు. 22వ తేదీ నుంచి అంతర్జాతీయ విమానాలను నిలిపివేశారని, 14 రోజులు వైరస్ ఇంక్యుబేషన్ పీరియడ్.. వచ్చే వారంరోజుల్లో ముగుస్తుందన్నారు. ఆ తర్వాత ఎన్ని కేసులు వస్తాయో స్పష్టమవుతుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులను సీఎం కేసీఆర్ ప్రతిక్షణం పరిశీలిస్తున్నారని, ప్రజల భద్రతకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని అన్నారు.

**ప్రైవేటు బోధనాసుపత్రుల్లో 10 వేల బెడ్లు**

పాజిటివ్ కేసులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించేందుకు గాంధీ, కింగ్‌కోఠి దవాఖానలను సిద్ధం చేస్తున్నట్టు మంత్రి ఈటల తెలిపారు. ప్రభుత్వ దవాఖానల పరిధిలో 7 వేల బెడ్లు, ప్రైవేటు బోధనాసుపత్రుల్లో 10 వేల బెడ్లు, 700 ఐసీయూ బెడ్లు , 190వెంటిలేటర్ బెడ్లు సిద్ధం చేసినట్టు వివరించారు. దేశంలో అన్ని రకాలుగా సంసిద్ధతతో ఉన్న రాష్ట్రం మనదేనని, మొదటివిడుతలో ప్రభుత్వ దవాఖానలను మాత్రమే కరోనా చికిత్సకు ఉపయోగిస్తున్నామని చెప్పారు. రెండోవిడుతలో హైదరాబాద్ పరిసరాల్లో ప్రైవేటు వైద్యకళాశాలలకు అనుబంధంగా ఉన్న దవాఖానలను, మూడోవిడుత జిల్లా కేంద్రాల్లో ఉన్న ప్రైవేటు బోధనాసుపత్రులను వాడుకుంటామన్నారు. సోమవారం నుంచి ప్రైవేటు వైద్యకళాశాలలు అవుట్ పేషెంట్లను బంద్‌చేసి, కరోనా చికిత్సకు కేటాయించాలని, వారం రోజుల్లో అన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. వైరస్ సోకినవారికి వైద్యసేవలు అందించే ప్రైవేటు బోధనాసుపత్రులకు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్లు అందిస్తామని చెప్పారు. సిబ్బందికి పాసులు, రవాణా, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసుకొంటే ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. కొవిడ్ వ్యాప్తి నియంత్రణకోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ ద్వారా పర్యవేక్షణకు ప్రతి వైద్యకళాశాలకు ఒక నోడల్ అధికారిని నియమిస్తారని పేర్కొన్నారు.



ధర్మపురి బస్టాండ్‌లో అధికారులకు సూచనలిస్తున్న మంత్రి కొప్పుల

## పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

### అధికారులకు మంత్రి కొప్పుల ఆదేశం

ధర్మపురి, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ కట్టడికి అధికారులు పారిశుద్ధ్య చర్యల్ని ముమ్మరం చేయాలని రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో శుక్రవారం మంత్రి పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు బాధ్యతగా స్వీయ నిర్బంధంలో ఉంటేనే కరోనా వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఈసారి జిల్లాలో ధాన్యం దిగుబడులు బాగా వస్తున్నాయని.. రైతులు మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తేవద్దని కోరారు. ఏప్రిల్ మొదటి వారంలోనే రెవెన్యూ గ్రామానికి ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా మద్దతు ధరకు కొంటామని స్పష్టం చేశారు.

# కొవిడ్ గుర్తింపునకు ప్రత్యేక పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా నిర్ధారించేందుకు అనుసరించాల్సిన పరీక్ష వ్యూహాన్ని (టెస్టింగ్ స్ట్రాటజీ) రూపొందించేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది. మరోవైపు యాంటీబాడీ పరీక్షలను ప్రారంభించడానికి భారత్ సిద్ధమైంది. ఈ క్రమంలో రక్తంలో ప్రతిరోధకాలను (యాంటీబాడీ) పరిశీలించే సెరోలాజికల్ పరీక్షలను చేపట్టాలని నిర్ణయించింది. ఈ పరీక్ష ద్వారా ఒక వ్యక్తికి గతంలో వైరస్ సోకిందా? లేదా? అనే విషయాన్ని గుర్తిస్తారు. ఇది కొవిడ్ లక్షణాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఉన్నతస్థాయి కమిటీ భావిస్తున్నది. ఇందులో భాగంగా యాంటిబాడీ కిట్లను రూపొందించడానికి ఐసీఎంఆర్ ఇటీవల బిడ్లను ఆహ్వానించింది.

**వైరస్‌పై పోరాడే 'టీ సెల్ ఎపిటోప్స్'**

కొండాపూర్: కరోనాతో పోరాడటంలో భాగంగా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచే వ్యాక్సిన్‌ను హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ రూపొందించింది. వైరస్‌లోని నిర్మాణ, నిర్మాణేతర ప్రొటీన్స్‌పై పోరాడే 'టీ సెల్ ఎపిటోప్స్'ను రూపొందించామని వర్సిటీ స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ సీమా మిశ్రా తెలిపారు.

## • చేతులు కడుక్కొని రండి..



రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామస్థులు ఊరి పొలిమేరల్లో డ్రమ్ముల్లో నీటిని నింపి, సబ్బును ఏర్పాటుచేశారు. ఎవరైనా ఊర్లోకి వస్తే కచ్చితంగా కాళ్లు, చేతులు కడుక్కోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ఓ ఇద్దరిని కూడా నియమించారు. – ఎల్లారెడ్డిపేట

## చైనా నుంచి వెంటిలేటర్లు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధమవుతున్నది. చైనానుంచి ఎన్-95 మాస్కులు, వెంటిలేటర్లను దిగుమతి చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. వీటి తయారీకి ఉపయోగించే ముఖ్యమైన వస్తువులు, స్వీయరక్షణ కిట్లు అత్యవసరమని భావించిన భారత్.. వాటిని సరఫరా చేయాలని చైనాను కోరింది. ఇవి దిగుమతి అయితే కరోనా ఉత్పాతం నుంచి భారత్‌ను రక్షించుకోవచ్చు. మాస్కులు, వెంటిలేటర్లకు సంబంధించిన అంశాలపై భారత విదేశాంగశాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్ ఇటీవల చైనా మంత్రి వాంగ్‌ఈతో చర్చించారు.

# సాఫీగా నిత్యావసరాల రవాణా

## ప్రత్యేక వ్యూహం రూపొందించిన పోలీస్‌శాఖ • రాష్ట్ర, జిల్లా, పోలీస్‌స్టేషన్లవారీగా బృందాలు
## వాహన యజమానుల ప్రతినిధులకూ చోటు • వాట్సప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ

హైదారాద్, నమస్తే తెలంగాణ: లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మందులు, నిత్యావసరాలు, ఆహారపదార్థాల రవాణా సాఫీగా సాగేలా పోలీసుశాఖ ప్రత్యేక ఏర్పాట్లుచేస్తున్నది. ఇందుకోసం డీజీపీ కార్యాలయంతోపాటు, అన్ని పోలీస్ కమిషనరేట్లు, జిల్లా ఎస్పీ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ల పరిధిలో పర్యవేక్షణ బృందాలను నియమించారు. నిత్యావసరాల క్యాటగిరీలోని 26 రకాల సేవలకు ఆటంకం తలెత్తకుండా ఈ బృందాలు పర్యవేక్షిస్తాయి. డీజీపీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి పోలీస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను అడిషనల్ డీజీ గోవింద్ సింగ్ నేతృత్వంలో ఏర్పాటుచేశారు. ఇందులో ఐజీ స్వాతిలక్రా, డీఐజీ సుమతి, డీఎస్పీలు, సీఐలు కలిపి మొత్తం 25 మంది అధికారులు ఉంటారు. వీరితోపాటు ఒక్కొక్క సరుకు రవాణా రంగం నుంచి ముగ్గురేసి ప్రతినిధుల చొప్పున అందుబాటులో ఉంటారు. సరుకు రవాణాలో ఎదురవుతున్న ఇబ్బందులను ఈ బృందం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుంది. ఇందుకోసం ఒక్కొక్క రంగానికి ఒక్కొక్క వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్‌చేశారు. ఒక పాయింట్ నుంచి సరుకును తీసుకెళ్లిన వాహనం.. దానిని అన్‌లోడ్ చేసి, తిరిగి గమ్యస్థానం చేరుకొనే వరకు వాట్సప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షిస్తారు. ఒకవేళ ఏదైనా వాహనానికి ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ఆయా రంగాల ప్రతినిధులు ఆ సమస్యను రాష్ట్రస్థాయి ఫెసిలిటేషన్ సెంటర్ దృష్టికి తీసుకెళ్తారు. అక్కడ నుంచి కమిషనరేట్, లేదా జిల్లా ఎస్పీ కార్యాలయం లేదా చెక్‌పోస్టును సంప్రదించి సమస్యను పరిష్కరిస్తారు.

**వాహనాలకు ప్రత్యేకంగా పాస్‌లు**

నిత్యావసర సరుకు రవాణా సేవల్లో పాల్గొనే వాహనాలను ఎక్కడా ఎవరూ అడ్డుకోకుండా ఉండేందుకు పోలీసులు సూచించిన ఫార్మాట్‌లో ప్రత్యేకంగా పాస్‌లు జారీచేస్తారు. వీటిని ఆయా వాహనాల ముందుభాగంలోని అద్దానికి స్పష్టంగా కనిపించేలా అతికిస్తారు. వీటిపై పోలీస్ అధికారుల సంతకం అవసరం ఉండదు. ఆయా సంస్థలకు చెందిన ఉన్నతస్థాయి సిబ్బంది సంతకం, వారి వివరాలు ఉంటే సరిపోతుంది. ఈ సేవలందించే సిబ్బంది కూడా ఆయా కంపెనీలు జారీచేసిన గుర్తింపుకార్డులు చూపిస్తే చాలు. అయితే అవి నకిలీవని తేలితే మాత్రం చర్యలు తీసుకొంటారు.




పోలీసులు రూపొందించిన వాహనాల పాస్

**Government of Telangana**
**Commercial Taxes Department**
**Auction Cancelled Notice**
"The Dealer M/s GR Cables Limited, Ranga Reddy Guda Village, Rajapur Mandal, Mahabubnagar District has come forward with a proposal for a settlement of dues. In view of the above the auction scheduled on 29.03.2020 is Cancelled".
**Sd/- Deputy Commercial Tax Officer, Jadcherla Circle, Nalgonda Division**
DIPR RO. No. 1025-PP/CL/Advt/1/2019-20, Dt: 27/03/2020

తెలంగాణ ప్రభుత్వం
ఇంజినీర్-ఇన్-చీఫ్ కార్యాలయం, MB, హైదరాబాద్
సవరణ
e-proc. T.N.No. 01,02,03 /MB/ENC/2019-20 , తేది: 28-02-2020 మిషన్ భగీరథ-హైదరాబాద్- మిషన్ భగీరథ ప్రాజెక్టుల క్రింద పనులకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో టెండర్ డాక్యుమెంట్ల లభ్యత : ఒరిజినల్ షెడ్యూల్ : 10-03-2020 నుండి 26-03-2020న మ. 3.00గం.వరకు, సవరించిన షెడ్యూల్ : 10-03-2020 నుండి 24-04-2020న మ. 3.00గం.వరకు, టెండర్ స్వీకరణ : ఒరిజినల్ షెడ్యూల్ : 10-03-2020 నుండి 26-03-2020న మ. 3.30గం.వరకు : సవరించిన షెడ్యూల్ : 10-03-2020 నుండి 24-04-2020న మ. 3.30గం.వరకు, టెక్నికల్ బిడ్ తెరుచు తేదీ : ఒరిజినల్ షెడ్యూల్ : 26-03-2020న సా. 4.00గం.కు. సవరించిన షెడ్యూల్ : 24-04-2020న సా. 4.00గం.కు., ఫైనాన్షియల్ బిడ్ తెరుచు తేదీ : ఒరిజినల్ షెడ్యూల్ : 30-03-2020న ఉ. 11.30గం.కు., సవరించిన షెడ్యూల్ : 29-04-2020న ఉ. 11.30గం.కు.
తదుపరి వివరాలను www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చును. సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్, మిషన్ భగీరథ, హైదరాబాద్
DIPR RO. No. 2725-DP/CL/Advt/1/2019-20, Dt: 27/03/2020

తెలంగాణ ప్రభుత్వం
ఇంజినీర్-ఇన్-చీఫ్ కార్యాలయం, MB, హైదరాబాద్
సవరణ
e-proc. T.N.No. AE/DEE/MB-HYD/Tenders/01/2019-20 , తేది: 25-02-2020 మిషన్ భగీరథ-హైదరాబాద్- మిషన్ భగీరథ ప్రాజెక్టుల క్రింద పనులకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో టెండర్ డాక్యుమెంట్ల లభ్యత : ఒరిజినల్ షెడ్యూల్ : 10-03-2020 నుండి 26-03-2020న మ. 3.00గం.వరకు, సవరించిన షెడ్యూల్ : 10-03-2020 నుండి 24-04-2020న మ. 3.00గం.వరకు, టెండర్ స్వీకరణ : ఒరిజినల్ షెడ్యూల్ : 10-03-2020 నుండి 26-03-2020న మ. 3.30గం.వరకు : సవరించిన షెడ్యూల్ : 10-03-2020 నుండి 24-04-2020న మ. 3.30గం.వరకు, టెక్నికల్ బిడ్ తెరుచు తేదీ : ఒరిజినల్ షెడ్యూల్ : 26-03-2020న సా. 4.00గం.కు. సవరించిన షెడ్యూల్ : 24-04-2020న సా. 4.00గం.కు., ఫైనాన్షియల్ బిడ్ తెరుచు తేదీ : ఒరిజినల్ షెడ్యూల్ : 30-03-2020న ఉ. 11.30గం.కు., సవరించిన షెడ్యూల్ : 29-04-2020న ఉ. 11.30గం.కు.
తదుపరి వివరాలను www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చును. సం/- చీఫ్ ఇంజినీర్-VI, మిషన్ భగీరథ, హైదరాబాద్
DIPR RO. No. 2726-DP/CL/Advt/1/2019-20, Dt: 27/03/2020

మన యాది - 2015

తెలంగాణ ఆవిర్భావం తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో మొదటి థర్మల్ విద్యుత్ ప్లాంటుకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్



ఎబోలా వైరస్ సోకినప్పుడు పాఠశాలలు మూసివేసిన అనుభవాలున్నాయి. పిల్లలు ఎక్కువ కాలం బడికి దూరంగా ఉంటే మళ్లీ రారు. అందువల్ల ప్రత్యామ్నాయ పద్ధతుల్లో బోధన సాగించాలి.

– రాబర్ట్ జెంకిన్స్ , యూనిసెఫ్ విద్యా విభాగ అధిపతి



నమస్తే తెలంగాణ

## కథానాయకులు

కరోనా వైరస్‌పై పోరాటం విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మకంగా, దశలవారీగా వ్యవహరిస్తున్న తీరు సత్ఫలితాలనిస్తున్నది. విదేశాలలో కరోనా వైరస్ సృష్టిస్తున్న భయానక పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి ఇందుకు మనం కూడా సమాయత్తం కాకతప్పదని ముందుగానే గ్రహించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయకుండా ఒక పద్ధతి ప్రకారం వారిని మానసికంగా సిద్ధం చేశారు. ముప్పు తీవ్రతను ప్రజలకు వివరిస్తూ, ముందు జాగ్రత్తలు చెబుతూనే మరోవైపు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో రంగంలోకి దింపారు. ఆ తర్వాత ప్రజా ప్రతినిధులు కూడా ఇందులో భాగస్వాములు కావాలంటూ బుధవారం ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రులు జిల్లాల్లో తిరుగాలని, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోనే ఉండి అధికారుల మధ్య సమన్వయం సాధించాలని కేసీఆర్ సూచించారు. దీంతో రాజధాని హైదరాబాద్ మొదలుకొని గ్రామస్థాయి వరకు కరోనా కట్టడి కార్యక్రమం ప్రజా ఉద్యమరూపం సంతరించుకున్నది. పల్లెల్లోని ప్రజలు కూడా స్వచ్ఛందంగా పరస్పర దూరం పాటించడమే కాకుండా, ఏకాంత వాసానికి ఏర్పాట్లు చేసుకోవడం ఆశ్చర్యకరం.

అధికార బృందంతో పోలిస్తే ప్రజాప్రతినిధులకు సమాజంతో ఎక్కువ సంబంధాలుంటాయి. ప్రజలతో కరకుగా కాకుండా సౌమ్యంగా వ్యవహరించి మెప్పిస్తారు. అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ఆయా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సహకరించగలరు. అందుకే కేసీఆర్ పిలుపు మేరకు మంత్రులు జిల్లాల్లో తిరుగుతూ భిన్న శాఖలకు మధ్య, ప్రజలకూ అధికారగణానికి మధ్య సమన్వయం సాధిస్తున్నారు. ఈ సందర్భంగా పురపాలక మంత్రి కేటీఆర్ తనదైన శైలిలో అవిశ్రాంతంగా పరిశ్రమిస్తున్న తీరు గమనార్హం. స్పందించే మనస్తత్వం ఉన్న సున్నిత మనస్కులకే ఎవరైనా చెప్పుకుంటారు. కేటీఆర్‌కున్న ఈ గుర్తింపు మూలంగా ఎక్కడో విదేశాలలో, ఇతర రాష్ర్టాలలో ఉన్న సామాన్యులు ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేయడం, ఆయన స్పందించడం సహజంగా మారింది. లాక్‌డౌన్ మూలంగా అక్కడక్కడా చిక్కుకుపోయిన వారిని ఆదుకోవడానికి ఆదేశాలు జారీ చేస్తూనే, స్వయంగా హైదరాబాద్‌లో క్షేత్రస్థాయిలో కేటీఆర్ పర్యవేక్షణ జరిపారు. గుడిసెలో ఆకలితో అలమటిస్తున్న దినసరి కూలీ, సొంత గ్రామానికి కాలినడకన సాగిపోతున్న పేద కుటుంబం–ఇటువంటి వారెవరు దృష్టికి వచ్చినా, నిర్లక్ష్యం చేయకుండా ఆదుకుంటూ ఇతర నాయకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

కరోనా ఎంతగా చెలరేగిపోయినా సరే, తట్టుకునేవిధంగా వైద్యులను, వసతులను కేసీఆర్ సమకూర్చి పెడుతున్నారు. ఇంత విపత్కర పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి రైతుల అవసరాల గురించి గుర్తుచేసి భరోసా ఇవ్వడం విశేషం. పొలాలకు నీటి కొరత ఉండదనీ, విద్యుత్ సరఫరా యథావిధిగా సాగుతుందంటూ ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి, రైతులు ఊరు దాటకుండానే ధాన్యాన్ని అమ్ముకొని, సొమ్ము బ్యాంకులో పడేవిధంగా ఏర్పాట్లు చేశారు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తేవాలనే మహత్తర లక్ష్యంతో కేసీఆర్ ఏర్పాటు చేసిన రైతు సమితులు ఈ కష్టకాలంలోనూ కీలకపాత్ర పోషించబోతున్నాయి. తెలంగాణ సాధన కోసం తాను ఆమరణ దీక్ష పట్టినప్పుడు, గ్రామగ్రామాన ప్రజలే కథానాయకులు కావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. కేసీఆర్ దీక్షకు చలించిపోయిన ప్రజలు ఉద్వేగంతో ఎక్కడికక్కడ ఉద్యమబాట పట్టారు. మళ్లా ఇప్పుడు అదే కేసీఆర్ ప్రజల ప్రాణ రక్షణ కోసం ఎక్కడి ప్రజలు అక్కడే కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు కూడా ప్రజలు అదే రీతిలో స్పందించాలి. మానవ మనుగడను కాపాడుకునే విశ్వవ్యాప్త యజ్ఞంలో భాగస్వాములు కావాలి.

# సత్యాగ్రహంతోనే కరోనా కట్టడి

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

సంగీతానికి చింతకాయలు రాలుతాయా అని అంటారు. చింతకాయలు రాలడమే కాదు సింహాలు సైతం బెదురుతాయని, వశమవుతాయని నిరూపించిన సంగీతజ్ఞులు, గాయకులున్నారు. కొన్నేండ్ల కిందట హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్ మైదానంలో, ఒక భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తూ సంగీత మహా విద్వాంసుడు, ప్రపంచ ప్రసిద్ధ గాయకు డు ఓంకార్‌నాథ్ ఠాకూర్ చెప్పిన విషయాలను విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. ఆయన చెప్పింది నిజమేనా అన్న అనుమానం కలిగింది. కానీ, ఆ మహా పండితుడు, వాగ్గేయకారుడు చెప్పిందంతా నిజమనడంలో సందేహం లేదు. ఓ రోజు సాయంత్రం ఓంకార్‌నాథ్ ఠాకూర్, ఆయన అనుచరులు మధ్యప్రదేశ్‌లోని ఓ అరణ్యం నుంచి ప్రయాణిస్తున్నారు. హఠాత్తుగా బలమైన ఓసింహం వచ్చి నడిరోడ్డు మీద నిలిచింది. ముందుకు వెళ్లలేమని, ప్రాణహాని తప్పదని అనుచరులు భయపడ్డారు.

**ఠాకూర్‌జీ** ఏ మాత్రం భయపడలేదు. ఆయన గంభీరమైన కంచుకంఠంతో, సహజసిద్ధమైన మాధుర్యాన్ని, తన్మయపరిచే అపార, అమోఘ సంగీతశక్తిని ఒలికిస్తూ ఒక శ్లోకాన్ని ఆలాపించడం ప్రారంభించారు. హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయకు, ఆయన రచించి ఆలాపించిన 'గగన్‌మస్త్ హోగయ' అజరామర గీతానికి ప్రేరణ కలిగించిన శ్లోకం అది. ఓంకార్‌నాథ్ ఠాకూర్ శ్లోకాలాపన ముగియక ముందే, నడిదారిలో మృగరాజు వలె తిష్టవేసిన ఆ సింహం తోక ముడిచి చడీచప్పుడు లేకుండా అరణ్యంలోకి వెళ్లింది. ఠాకూర్‌జీ సంగీతశక్తి ప్రబలంగా తెలిసిన అనుచరులు సైతం అమితాశ్చర్యానికి గురైనారు. శ్లోకంలో అంతులేని బలం ఉంది; వశీకరణ శక్తి ఉంది. ఆ శ్లోకాన్ని మహత్తరంగా, మేఘగర్జన వలె ఆలాపించిన గాయకుడిలో ఎంత శక్తి ఉందన్నది ముఖ్యం.

మన ప్రాచీనతకు ప్రతీకలైన వేదాలు, ఉపనిషత్తులు, బహుళ శాస్త్రాల్లో మానవాళి శ్రేయస్సుకు బహుముఖంగా దోహదపడగల అపార శక్తి ఉంది. కానీ, వేదాలను, ఉపనిషత్తులను, వివిధ శాస్త్రాలను, వాటి పేరు చెప్పి కుటిల రాజకీయాలకు ఉపయోగించాలనుకుంటున్న మతోన్మాదులు మహర్షులు కాలేరు. శ్లోకాలు ఆలాపించిన వాళ్లందరు ఓంకార్‌నాథ్ ఠాకూర్‌లు కాలేరు. మాక్స్‌ముల్లర్, ఐన్‌స్టీన్, బెట్రాండ్ రస్సెల్ వంటి మహా పండితులు, మహా మేధావులు మెచ్చినవి, గౌరవించినవి మన వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు. ఈ ప్రాచీన విజ్ఞాన సంపదను ప్రయోజనకరంగా, మానవాళి మేలు కోసం ఉపయోగించగలిగినవారు మనకు ఈ రోజుల్లో ఎందరున్నారన్నది పది ట్రిలియన్ల ప్రశ్న. శాస్త్రాలకు న్యాయం చేయగలుగుతున్నామా లేదా అన్నది మరో ప్రశ్న.

గతేడాది 2019 ఏప్రిల్ 6న తెలుగుసీమ అంతటా వికారినామ సంవత్సర ఉగాది రోజు పంచాంగ పఠనం జరిగింది. విశేషించి హైదరాబాద్‌లో ప్రముఖంగా ఐదారు చోట్ల పేరొందిన పండితులు, సిద్ధాంతులు, పంచాంగకర్తలు పంచాంగ పఠనం చేసి అంతా బాగుందన్నారు. వారు భవిష్యత్తును పూల పాన్పుగా చిత్రించినప్పటికీ, సామాన్యులు మాత్రం 'వికారి' పేరు వినగానే భయపడ్డారు. భవిష్యత్తు 'సకారి'గా, సంతోష ప్రదంగా ఉంటుందని సామాన్య జనకోటి భావించలేదు. దేశ ప్రజల, తెలుగు రాష్ర్టాల ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు ప్రమాదకరంగా ఒక మహమ్మారి కరోనా వైరస్ ముంచుకొస్తుందని ప్రముఖ పంచాంగకర్తలు, పంచాంగ పఠనం చేసిన పండితులు సూచనప్రాయంగానైనా ఆ రోజు చెప్పలేదు. పంచాంగకర్తలకు తెలిసినా చెప్పలేదనుకోవాలా?! ఏడాది గడువకముందే వికారినామ సంవత్సరం ఎంతటి భయానకమైనదో, మన ఆరోగ్యానికి, ప్రాణాలకు ఎంతటి ముప్పును కలిగిస్తున్నదో స్పష్టమైంది. పంచాంగ రచనకు, భవిష్యత్ జోస్యాలకు ప్రాతిపదిక అయిన, మూలమైన ఖగోళశాస్త్రంలో లోపం లేదు, శాస్త్రాలు సమగ్రమైనవి అయినా కాకపోయినా వాటిలో లోపం లేదు. శాస్త్రాలను నిర్వచించి, వివరించి, అన్వయించి భాష్యం చెప్పేవారిలోనే ఏవైనా లోపాలున్నాయనుకోవాలె. ముప్రీతి కోసం, ఎవరికో సం తృప్తి కల్గించడానికి శాస్త్రానికి వివరణలు ఇచ్చే పండితులు, సిద్ధాంతులు, పంచాంగకర్తలు, భాష్యకారులు ఎవరికీ న్యాయం చేయడం లేదనాలె. శాస్త్రానికి మసిపూసి మారేడుకాయ చేయడం వల్ల నష్టమే కానీ లాభం ఉండదు. వికారి సంవత్సరంలో ఒక విదేశీ మహమ్మారి విజృంభించి, వ్యాపించి దేశంలో కోట్లాదిమంది (సామాన్యులు, అసామాన్యులు అన్న తారతమ్యం, విచక్షణ లేకుండా) ప్రాణాలకు ప్రమాదకారి అవుతుందని 2019 ఏప్రిల్ 6 పంచాంగ పఠనంలోనే హెచ్చరించి ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర దేశాల ప్రభుత్వాలు ముందే జాగరూకత వహించగలిగేవి.



సంగీత విశారదుడు ఓంకార్‌నాథ్ ఠాకూర్ ఒక శ్లోకం ఆలాపనతో ఓ క్రూర మృగాన్ని వశపరచుకోగలిగినప్పుడు దేశమంతటా తామరతంపరగా ఉన్న స్వాములు, యోగులు, బాబాలు (వీరు వేదాలను, ఉపనిషత్తులను, వివిధ శాస్త్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిని ఆపోశనం పట్టిన తపోధనులని కోట్లాది సామాన్యులు, అమాయక చక్రవర్తులు గాఢంగా విశ్వసిస్తారు) కరోనా వైరస్ మహమ్మారిని నియంత్రించలేరా అని ప్రశ్నించడంలో తప్పు లేదు. వరుసగా ఆరేండ్ల నుంచి ప్రతి క్వార్టరు కాలంలో అభివృద్ధి రేటు తగ్గి, అన్నిరంగాల్లో ఉత్పత్తులు, ఎగుమతులు క్షీణించి, నిరుద్యోగం వికృతరూపం ధరించి ఆర్థికమాంద్యం భయంకర స్వరూపం ధరించిన క్లిష్ట పరిస్థితిలో కరోనా కాటు గోరుచుట్టుపై రోకటిపోటయింది. ఇప్పటికే రూ. లక్షల కోట్ల విలువైన నష్టం సంభవించింది. రేపోమాపో కరోనా కనుమరుగైనా ఈ నష్టం, అది కలిగించే విపరీత భారం మిగిలే ఉంటాయి. ఈ ఆర్థిక భారాన్ని సామాన్యులే మోయక తప్పదు. నాలుగు నెలల కిందట కరోనా వైరస్ సంక్రమణం, వ్యాప్తి మొదలైనా (వూహాన్ నగరంలో) చైనా ప్రభుత్వం ఈ ప్రమాదం గురించి తెలియజేయలేదని, ఆ విషయాన్ని దాచిపెట్టిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతులు కాలిన తర్వాత మండిపడుతున్నాడు. చైనాలోని కమ్యూనిస్టు ప్రభుత్వం, అక్కడి అప్రజాస్వామిక వ్యవస్థ అన్ని విషయాలను బయటి ప్రపంచానికి వెల్లడిస్తుందనుకోవడం పొరపాటు. ఐరన్ కర్టెన్ వెనుక ఏం జరుగుతున్నదో తెలుసుకోవడం కష్టం. అమెరికా ఇంటెలిజెన్స్ వ్యవస్థ, చైనాలోని అమెరికా రాయబారి కార్యాలయం, డబ్ల్యూహెచ్‌వో, అక్కడి భారత రాయబారి కార్యాలయం కరోనా పుట్టుకను పసిగట్టడంలో విఫలమైనాయి. భారత ప్రభుత్వం తన సరిహద్దులకు ఆవల చైనాలో ఒక మహమ్మారి చేస్తున్న కరాళ నృత్యాన్ని గమనించలేకపోయింది. చైనాతో ఈ మధ్య ఆర్థిక, పారిశ్రామికరంగాల్లో సన్నిహిత సంబంధాలు ఏర్పడిన, పెద్ద సంఖ్యలో చైనీయుల రాకను నిరోధించలేకపోయిన ఇటలీ, ఇరాన్ కరోనా ఆకలికి బలవుతున్నాయి.

కీలెరిగి వాత పెట్టడం కేసీఆర్ ప్రత్యేక పద్ధతి. తెలంగాణ రాష్ట్రం సాధించడానికి పద్నాలుగేండ్ల మహోజ్వల ఉద్యమంలో కేసీఆర్ తనదైన పద్ధతితో పలు జయప్రద ప్రయోగాలు జరిపారు. లక్ష్యాన్ని సాధించిన ప్రయోగాలివి. గత ఆరేండ్ల సుపరిపాలనలో కూడా కొన్ని సందర్భాల్లో ఆ మహా నాయకుడు కేసీఆర్ ఈ ప్రయోగాలు జరుపవలసి వచ్చింది. సకల ప్రపంచాన్ని వణికిస్తున్న చైనా విష క్రిమి కరోనా వైరస్‌ను వెంటనే అదుపు చేయడానికి ఈ పద్ధతిపై ఆధారపడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రమంతటా లాక్‌డౌన్ ప్రకటించింది. ఇదొక విధంగా గాంధీజీ అనుసరించిన Passive Resistance సత్యాగ్రహం. కరోనాను శాశ్వతంగా అరికట్టడంలో ఈ సత్యాగ్రహ విధానం నిశ్చయంగా విజయం సాధించవచ్చు. కశ్మీరులో 2019, ఆగస్టు 5 నుంచి లక్షలాది ప్రజలు, ముఖ్యంగా వేలాది రాజకీయ కార్యకర్తలు, నాయకులు కనీసం సెల్‌ఫోన్ సదుపాయమై నా లేని గృహ నిర్బంధాలకు, లాక్‌డౌన్‌కు గురవుతున్నారు. కశ్మీర్ నిర్బంధాలు, ఆంక్షలతో పోల్చినప్పుడు ఇక్కడి లాక్‌డౌన్ కఠినం కాదు. కరోనా వైరస్ వూహాన్ (చైనా) దాటి ప్రపంచమంతటా సంక్రమిస్తున్నది. కరోనా కఠిన అనుభవాలతో ఈ దేశం పాఠాలు నేర్చుకొని భవిష్యత్ భద్రత కోసం జాగరూకత వహించా లె. Blessing in Disguise అంటారు పెద్ద లు. కొవిడ్–19 విషపు రోగం. దీనికి చేదు మందులు వేయక తప్పదు. ■

> కీలెరిగి వాత పెట్టడం కేసీఆర్ ప్రత్యేక పద్ధతి. తెలంగాణ రాష్ట్రం సాధించడానికి పద్నాలుగేండ్ల మహోజ్వల ఉద్యమంలో కేసీఆర్ తనదైన పద్ధతితో పలు జయప్రద ప్రయోగాలు జరిపారు. లక్ష్యాన్ని సాధించిన ప్రయోగాలివి. గత ఆరేండ్ల సుపరిపాలనలో కూడా కొన్ని సందర్భాల్లో ఆ మహా నాయకుడు కేసీఆర్ ఈ ప్రయోగాలు జరుపవలసి వచ్చింది.

# జనసాంద్రతకు తగిన జాగ్రత్త

సూది మొనమీదనే పది కోట్ల సంఖ్యలో ఈ కరోనా వైరస్ నిలబడగలదట. కంటికి కనిపించని ఈ సూక్ష్మజీవి ప్రపంచ ప్రజలందరినీ హడలగొడుతున్నది. గత అక్టోబర్‌లో దీని ఉనికిని గుర్తించినా దీని ప్రమాదం మొదలైంది డిసెంబర్ చివరివారంలో. నేటికి అది 14వేలకు పైగా మందిని కబళించింది. సుమారు రెండు లక్షల మంది ఇంకా దీని విషపు కోరల్లో చిక్కుకున్నారు. దీనికి ఇప్పటిదాకా మందులేదు. ఇప్పటిదాకా యాంటీబయాటిక్సే ప్రయోగాత్మకంగా చికిత్సలో వినియోగిస్తున్నారు. వ్యాధి ముదరక ముందు నిరోధకశక్తి ఎక్కువ ఉన్నవారు బతుకుతున్నారు.

విశ్లేషణ



ప్రొ॥ పులికొండ సుబ్బాచారి

ఈ విష క్రిమి సోకకుండా మనల్ని మనం దూరంగా ఉంచుకోవడమే నివారణ. ఇది మనిషి నుంచి మనిషికి తుమ్ము, దగ్గు, స్పర్శల ద్వారా వ్యాపిస్తూ ఉన్నది.

భారతదేశం లాంటి జన సమ్మర్దం ఉన్న దేశంలో ఒక మనిషి తుమ్మితే క్షణంలో కొన్ని వందల మందికి ఇది చేరే ప్రమాదం ఉన్నది. పటిష్టమైన వ్యూహంతో పది రోజుల్లోనే అసాధారణరీతిలో దవాఖాన సౌకర్యాలను అందించి చైనా ప్రపంచ ప్రజలను ఆశ్చర్యచకితులను చేసింది. నిర్లక్ష్యం కారణంగా చైనా కన్నా ఇటలీ ఎక్కువ ప్రజానీకాన్ని చంపుకున్నది. చైనాతో పోలిస్తే ఇటలీ భౌగోళికంగా చాలా చిన్న దేశం. పదో వంతు వైశాల్యం కూడా ఉండదు. చైనా జనాభా ఇప్పటికి 143 కోట్ల 33 లక్షలు. కానీ ఇటలీ జనాభా కేవలం 60 కోట్లు. కానీ చైనాలో మరణాల సంఖ్య నేటివరకూ 3,270 మంది కాగా, ఇటలీలో మరణించిన వారు 5,476 మంది. ఇది కరోనా ప్రారంభస్థితిలో ఇటలీ చేసిన నిర్లక్ష్యానికి ఫలితం. అక్కడ కరోనా మూడో దశలో ఉన్నది.

జనసాంద్రత చైనా, ఇటలీతో పోలిస్తే మన దేశంలో ఎక్కువ. ఇక్కడ కరోనా ఈ రెండో దశలో అరికట్టలేకపోతే మనం ఇటలీ కన్నా భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుం ది. ఇలాంటి క్లిష్టపరిస్థితిలో మన ప్రభుత్వాలు సరైన వ్యూహాన్ని అవలంబించాలి. ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రజారవాణా నిలుపుదల, 12 గంటల కర్ఫ్యూ ప్రధానం.

తెలంగాణ ప్రభుత్వం, కేంద్రం కన్నా మరింత జాగరూకతతో వ్యవహరిస్తున్నది. కేంద్రం 12 గంటల జనతా కర్ఫ్యూను ప్రకటిస్తే, కేసీఆర్ రాష్ట్రంలో ఇది 24 గంటలు ఉంటుందని అమలుపరిచారు. తెలంగాణ ప్రజలు మంచి స్ఫూర్తిని చాటారు. కేంద్రం కన్నా, ఇతర రాష్ట్ర ప్రభుత్వాల కన్నా కూడా కేసీఆర్ మరింత పటిష్టమైన ప్రణాళికను అందరికన్నా ముందే ప్రకటించారు. మార్చి 31 వరకూ రాష్ట్రం లాక్‌డౌన్‌లో ఉంటుందని, రాష్ట్ర సరిహద్దులను మూసివేసి, మహమ్మారి నిరోధక చట్టం–1879ని పూర్తిగా అమలుచేస్తామని ప్రకటించారు. చైనాలో జనసాంద్రత చదరపు కి.మీ.కు 145 అయితే, అదే మన దేశంలో 455 మంది. ఇదే తెలంగాణలో జనసాంద్రత చ.కి.మీకి 307. గుంపులుగా కూడి ఉండే పరిస్థితిని పోలిస్తే సగటున భారత దేశంలో ఎంతమంది జనం ఉంటారో అంత మంది తెలంగాణలో కూడా ఉండే అవకాశం ఉన్నది. అంటే కరోనా వ్యాపిస్తే చైనాలో కన్నా భారతదేశంలోనూ అందులో తెలంగాణలోనూ నాలుగు రెట్లు అధికంగా ఉండవచ్చు. ఈ దృష్టితో చూస్తే కరోనా నిరోధాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఎంత ముందుచూపుతో నిరోధించడానికి నడుం కట్టిందో తెలుస్తుంది.

ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం పది రోజుల కర్ఫ్యూ ప్రకటించి ఊరుకోలేదు. రోజు పని చేస్తే కానీ పూట గడువని ప్రజలు ఇలాంటి నిర్బంధ దినాల్లో ఎన్ని కష్టాలు పడుతారో ఆయనకు తెలుసు. అందుకే ఇలాంటి ప్రజలకు మనిషికి 12 కిలోల బియ్యాన్ని పంపిణీ చేయాలని అంతేకాకుండా కుటుంబానికి రూ.1500 ఆర్థిక సహాయం ఇవ్వాలని నిర్ణయించారు. గర్భిణులకు ఏ లోటులేకుండా రవాణా, మందులకు ఏ లోటు లేకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని సంస్థల్లో పనిచేసే కార్మికులకు సెలవుదినాల్లో కూడా ఆ సంస్థలో జీతాలు చెల్లించాలని చట్ట ప్రకారంగా నిర్దేశించడం హర్షణీయం. కేసీఆర్ మీడియా సమావేశంలో చేసిన సమగ్ర ప్రణాళికా ప్రకటన ఆయన రాజనీతి సూచికగా నిలుస్తుంది.




మనిషికి మనిషి దూరంగా ఉంటూ ఎవరి ఇండ్లలో వారు ఉండిపోవడం వల్ల వైరస్ వ్యాప్తిని 90 శాతం అరికట్టవచ్చు. కొత్తగా సోకినవారిని తక్షణం దూరం పెట్టి చికిత్స అందించడం వల్ల కొత్తగా వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పడిపోతుంది. కాబట్టి కరోనా వ్యాప్తిని ఆరంభస్థితిలోనే నియంత్రించవలసిన అవసరం ఉన్నది. దీనిని ముందుగా గ్రహించి ప్రణాళికారచన చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని అభినందించాలి.

ఈ సందర్భంలో తెలంగాణ పౌరులు ఉత్తమపౌరులుగా ప్రభుత్వ నిర్దేశాలకు అనుగుణంగా నడుచుకోవాలి. ఇంటికి పరిమితం కావాలి, పరిశుభ్రత పాటించాలి. ఇలా విజయవంతంగా ఈ మహమ్మారిని మన గడ్డ నుంచి మన దేశం నుంచి నిర్మూలించవలసిన సమయం ఇది. అందరూ జాగరూకతతో మెలుగుదాం. రక్షణచర్యలు తీసుకుందాం. ■

## కడుపు నిండా తిను కంటినిండా కునుకు తీయ్..

కడుపు నిండా కమ్మగ తిని
ఇంట్లనే కంటినిండా నిద్రవోత్రి వయా అంటే..
లేదు, రోడ్డు మీద తిరుగుకుంటా
రోడ్ సైడ్ రోమియో లాగా బిహేవ్ చేస్తమంటే ఎవరేం చేస్తరు?
రెండ్రోజులకే మనమింత ఆగమాగమైతే?
నెలల తరబడి లాక్‌డౌన్ చేయాల్సి వస్తే..!
దేశాధ్యక్షులు సైతం గృహ నిర్బంధం చేసుకుంటూంటే..
దోస్తుల్లేరు, ముచ్చట్లు లెవ్వు
బంధువుల్లేరు, బతాకానీల్లేవు
కంటికి కనపడని వైరస్ నుంచి కాపాడటాని కోసం
ఇప్పుడు యావత్ దేశం లాక్‌డౌన్..!
అర్థం చేసుకోండి.. ఆలోచించండి..
మనల్ని మనం కాపాడుకుందాం
మన దేశాన్ని సంరక్షించుకుందాం
ఇంటిపట్టున ఉందాం..
పొద్దుగాళ్ల చాయ్ నుంచి
కంటిమీదికి కునుకు చేరే దాకా
ప్రతి నిమిషాన్ని మానవాళి శ్రేయస్సు కోసం వెచ్చిద్దాం
'క్వారంటైన్'.. కష్టం అనుకోవద్దు
'క్వారంటైన్' ఓ సదవకాశం
క్వారంటైనే మనల్ని కరోనా కష్టం నుంచి గట్టెక్కించేది
సామాజిక దూరమే.. సమాజాన్ని సంరక్షించేది
అవసరం పేరుతో అడుగు బయటపెట్టకు
ఉన్నదాంట్లోనే సర్దుకో
ఉన్న ఇంటినే ఉన్నతికి ప్రయోగశాలగా మార్చుకో
ప్రతి క్షణం ప్రయోజనకరమే..
పరోపకారార్థమే..



- గడ్డం సతీష్, 99590 59041

## ఇకనైనా మేలుకో!

ఓ మనిషి..
ఏమవుతాయి నీ డబ్బులు
ఏమవుతాయి నీ బంగళాలు
ఏమవుతాయి నీ స్మార్ట్‌ఫోన్‌లు
ఏ కారులో వెళ్లగలవు బయటికి నేడు
ఏ విమానంలో బయటకు వెళ్లగలవు నేడు..!

ఎవడు నిన్ను తాకుతాడు ఈ రోజు...

ప్రకృతికి వ్యతిరేకంగా మనం
చేస్తున్నటువంటి ప్రతి క్రియకు ప్రకృతి
ప్రసాదించిన ప్రతిక్రియ ఇది..
డబ్బులు ఇచ్చి ఆపగలవా కరోనాను?
ఆపలేం.. కాబట్టి ఈ రోజు నుంచి అయినా
ప్రకృతిని కాపాడుకుంటా
ప్రజలను కాపాడుకుందాం...

- దాస్యం వినయభాస్కర్, ప్రభుత్వ చీఫ్ విప్

## హలో..

నేను
మహమ్మారి 'కరోనా'ను
రాజునైనా
బంటునైనా
ఇంటినుంచి బయటకు వస్తే
కబర్ లేకుండా చంపేస్తా..
మీరు ఇంట్లోనే ఉంటే
నాకు నేనుగా కనుమరుగై చస్తా...

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 94402 33261

# భగవద్గీత.. మన హిత






గన్నమరాజు గిరిజా మనోహరబాబు

యత్రగీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్।
తత్రాహం నిశ్చితం పృథ్వి। నివసామి సదైవహి॥

'వరాహ పురాణం'లోని ఈ శ్లోకం గీతా మహాత్మ్యాన్ని గురించి సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అమ్మవారికి చెప్పిన సందర్భం లోనిది. 'ఓ భూదేవీ! ఎక్కడైతే భగవద్గీతపై విచారణ జరుగుతుందో, ఎక్కడైతే ఈ గ్రంథాన్ని చదువడం, వినడం, బోధించడం జరుగుతుందో.. అక్కడంతా ఎల్లప్పుడూ తప్పక నేనుంటాను' అన్న స్వామివారి పలుకులను లోతుగా విశ్లేషించుకొంటే 'భగవద్గీత' ఔన్నత్యం మనకు అర్థమవుతుంది.

'భగవద్గీత' సర్వ ఉపనిషత్తుల సారం. 'భగవద్గీత' బ్రహ్మ విద్య. ఇదొక యోగశాస్త్రం. 'భగవద్గీత' ఔన్నత్యాన్ని, అవసరాన్ని గుర్తించిన శంకర భగవత్పాదుల వారు, రామానుజాచార్యుల వారు, మధ్వాచార్యుల వారు తమ తమ ఆలోచనలతో భాష్యాలు రచించారు. మన పూర్వు లు దీన్ని ప్రస్థాన త్రయంలో ఒకటిగా సంభావించా రు. యావత్ విశ్వంలో ఇంతటి హితాన్ని బోధించే గ్రంథం మరొకటి లేదని తత్త్వవేత్తల అభిప్రాయం. స్వాతంత్ర్య పోరాట సందర్భంలోను లోకమాన్య బాలగంగాధర తిలక్, మహాత్మా గాంధీ వంటి మహామహులు భగవద్గీతా గ్రంథాన్ని ఎంతో గొప్పగా గౌరవించి ప్రజల్లో ప్రచారం చేశారు. నరనారాయణులు ఇద్దరూ నారాయణ స్వరూపులే. అంటే, నారాయణుడు తానే గురువుగా, తానే శిష్యునిగా అవతరించి, తన అంశావతారమైన వేదవ్యాస మహ ర్షి ముఖ్యంగా దీన్ని లోకానికి అందించాడు. ఇదొక పవిత్ర గ్రంథంగా విశిష్ఠ ఆదరణను పొందడానికి, ఇందరు మహా పురుషుల ప్రమేయం ఉన్న దీని పుట్టుక ఒక కారణమైతే, అంతఃస్సారాన్ని గ్రహించినప్పుడు అన్నివిధాలా విశ్వ మానవజాతికి కర్తవ్యాన్ని బోధించే ఉత్తమ ప్రయోజనకర గ్రంథంగానూ దీనిని తెలుసుకోవచ్చు.

పదునెనిమిది అధ్యాయాలుగా విస్తరించిన భగవద్గీత అర్జునునిలోని నిర్వేదాన్ని పరిహరించాలన్న శ్రీకృష్ణ పరమాత్ముడు కురుక్షేత్ర సంగ్రామానికి పూర్వం చెప్పిన ఈ 'గీత' లోని అన్ని అధ్యాయల్లోనూ ప్రపంచంలోని ప్రతి మానవునికి ఉపయోగపడే అనేక సత్యాలు ఆవిష్కృతమయ్యాయి. వ్యక్తి సమాజానికి కేంద్రం కనుక వ్యక్తి వల్లనే ఏ సమాజమైనా పటిష్ఠమవుతుంది. వ్యక్తి సంస్కరణ అంటే, సమాజ సంస్కరణే అన్నది అందరూ అంగీకరించే సత్యం.




భగవద్గీతను కేవలం ఆధ్యాత్మిక గ్రంథంగానో, ఏదో ఒక మత గ్రంథంగానో భావించడం వల్ల దానిలోని అనేక పార్శ్వాలను మనిషి కోల్పోయే ప్రమా దం ఉన్నది. ప్రతి మనిషి ముందుగా తనను తాను ఉద్ధరించుకొనే ప్రయత్నాన్ని చిత్తశుద్ధితో చెయ్యాలి. అప్పుడే అతని ఆత్మోద్ధరణానికి భగవంతుని సాయం అందుతుంది. తాను కర్తవ్య విముఖుడై సర్వం భగవంతుడే చెయ్యాలని అనుకోవడం అతడు తన కర్తవ్య నిర్వహణ నుంచి దూరమవుతున్నాడని తెలుసుకోవచ్చు. యుద్ధం ద్వారా కురువీరుడైన అర్జునుడు దుష్టశిక్షణ చెయ్యాలి. అది అతని కర్తవ్యం. కానీ, బలహీన మనస్కుడై, కర్తవ్య పరాన్ముఖుడైన అర్జు ఌుడిని ఉద్దేశించి శ్రీకృష్ణుడు..

'క్లైబ్యం మాస్మగమః పార్థ। నై తత్త్వయ్యుపపద్యతే।
క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప'॥ (2–3) అని

బోధించాడు.హేయమైన మానసిక దుర్బలత్వాన్ని వదిలి లేచి నిలబడి శత్రువును సంహరించాలని బోధించడం, చేత కానితనాన్ని దరిచేరనీయక, నిర్వేదాన్ని పొందకుండా కర్తవ్య నిర్వహణకు ప్రతి వ్యక్తి పూనుకోవాలన్న సందేశాన్ని భగవద్గీత మానవాళికి అందిస్తున్నది. అందుకే, ఇది అంతటి విలువైన మానవహిత గ్రంథమైంది.